# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
19-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 59

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## జూన్ 2న కొత్త పింఛన్లు?!

**రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు సైతం**

**తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం**



**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తోంది. కీలకమైన మూడు నిర్ణయాలను తీసుకుంది. కొత్త పింఛన్లతో పాటు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల జారీకి సంబంధించి తీపి కబురు చెప్పింది. ఇప్పటికే పెద్ద ఎత్తున దరఖాస్తు

మిగతా 2,3లో

## హైదరాబాద్ నడిబొడ్డున ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు

**రేవంత్ వ్యూహాత్మక రాజకీయం**




**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. సరికొత్త పొలిటికల్ గేమ్ ఆడుతున్నారు. తెలంగాణలో టిడిపి ఓటు బ్యాంకును పదిలం చేసుకునేందుకు ఆయన గట్టిగానే ప్రయత్నాలు

మిగతా 2లో

## మమతా బెనర్జీకి షాక్!

**ఆమె ప్రవేశపెట్టిన మతపరమైన పథకాలకు బ్రేక్**

**సంచలన నిర్ణయాలు దిశగా కొత్త ప్రభుత్వం**



క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్: బెంగాల్లో మమతకు షాక్ ట్రీట్మెంట్ ఇవ్వడం ప్రారంభించారు ముఖ్యమంత్రి సువేందు అధికారి. మమతా బెనర్జీ హయాంలో అమలు చేసిన మతపరమైన

# కొత్తగా ముగ్గురికి!



**తెలంగాణ మంత్రి వర్గంలో చోటు దక్కే అవకాశం**

**ఢిల్లీ బాటపడుతున్న సీనియర్లు**

**పెద్దల మద్దతు కోసం గట్టి ప్రయత్నాలు**

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ తప్పకుండా జరుగుతుందన్న ప్రచారం నడుస్తోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తి కావడంతో కాంగ్రెస్ హై కమాండ్ తెలంగాణలో మంత్రివర్గ ప్రక్షాళన, పార్టీ పదవులపై కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. దీంతో ఆశావహులు ఢిల్లీ బాట పడుతున్నారు. మంత్రి పదవుల కోసం లాబీయింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం క్యాబినెట్లో ఉన్న ఇద్దరు పదవులు కోల్పోవడం ఖాయమని తెలుస్తోంది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ముగ్గురికి కొత్తగా ఛాన్స్ దక్కే అవకాశం కనిపిస్తోంది. అయితే ఆ ముగ్గురు అదృష్టవంతులు ఎవరు అనే దానిపై జోరుగా చర్చ నడుస్తోంది.

**ఆ ఇద్దరు నేతలు పోటాపోటీగా..**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు దాటుతోంది.

3లో



## తిరుచ్చి ఉప ఎన్నికల్లో స్టాలిన్!

- పోటీ చేసేందుకు సిద్ధం
- అసెంబ్లీలో అడుగుపెట్టడమే వ్యూహం
- అన్నా డీఎంకే పరోక్ష మద్దతు

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తమిళనాడు ఎన్నికల ప్రక్రియ ముగిసింది. విజయ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా విజయ్, మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. పాలన ప్రారంభం అయింది. ఇటువంటి తరుణంలో ఇప్పుడు అందరి దృష్టి తిరుచ్చి ఉప ఎన్నికపై పడింది.

3లో

## బండి భగీరథ్‌పై కఠిన సెక్షన్!

- నేరం నిరూపితమైతే పదేళ్ల జైలు
- లోతైన దర్యాప్తు చేపడుతున్న పోలీసులు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో బండి సంజయ్ కుమారుడి వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. దీని చుట్టూనే రాజకీయం నడుస్తోంది. బండి సంజయ్ కుమారుడు భగీరథ్ లొంగిపోవడంతో ఊహించని మలుపు తిరిగింది. పలు తీవ్రమైన ఆరోపణలతో పోలీసులు అతడిపై చాలా రకాల సెక్షన్లు పెట్టారు. ఇప్పుడు తాజాగా మరో కీలక సెక్షన్ జోడించడంతో.. ఈ కేసు మరింత జటిలం అవుతోంది.

- మిగతా 2వ పేజీలో



## బండి భగీరథ్ కేసు వాదిస్తున్న వైసీపీ ఎంపీ!


**గతంలో అల్లు అర్జున్ కు వాదన.. వెంటనే బెయిల్**

**లాయర్ నిరంజన్ రెడ్డి ట్రాక్ రికార్డ్ అదే**

## ప్రాదేశిక పోరు!

**తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసి ఎన్నికలు**

**అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్న రాష్ట్ర ఎన్నికల సంఘం**




**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో ప్రాదేశిక ఎన్నికలకు సంబంధించిన వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఏ క్షణంలోనైనా ప్రాదేశిక ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే

- మిగతా 2వ పేజీలో

# స్థానిక ఎన్నికల బహిష్కరణ!

**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మక ఎత్తుగడ**

**ఇప్పటికీ యాక్టివ్ కానీ నియోజకవర్గ ఇన్చార్జిలు**

**ఎన్నికల్లో పోటీకి ద్వితీయ శ్రేణి నేతల విముఖత**

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భారీ సంక్షేమ పథకాల ప్రకటన తరువాత ఎన్నికల ప్రక్రియకు వెళ్లే అవకాశం ఉంది. వచ్చే జూన్ లో తల్లికి వందనం పథకం అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మత్స్యకార భరోసా కింద నిధుల విడుదలకు కూడా నిర్ణయించింది. అన్నదాత సుఖీభవ నిధులు కూడా జమ చేయనుంది.



2లో

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** జూన్ 12న కొత్త పింఛన్ల జారీకి నిర్ణయించింది. కూటమి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న తరుణంలో కొత్త పింఛన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇవన్నీ పూర్తయిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అడుగులు వేయనుంది కూటమి ప్రభుత్వం. అయితే ప్రభుత్వ దూకుడు చూసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

## ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం

**తక్షణం స్పందిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం**

**మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి**



హైదరాబాద్: ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా

2లో



## బండి సంజయ్ జపం చేస్తున్న బీఆర్ఎస్!

**బిజెపిని దెబ్బతీసేందుకు గులాబీ పార్టీ వ్యూహం**

**వ్యక్తిగత, కుటుంబ వ్యవహారాలతో తెలంగాణలో నిలదొక్కుకునే ప్రయత్నం**

**వర్కౌట్ కాదంటున్న విశ్లేషకులు**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో ఇప్పుడు బండి సంజయ్ చుట్టూ రాజకీయం వాతావరణం తిరుగుతోంది. ఆయన కుమారుడి పై నమోదైన పోక్సో కేసును అస్త్రంగా చేసుకుని గులాబీ పార్టీ దాడి చేస్తోంది.

# ప్రాదేశిక పోరు!

అవకాశం ఉందని ఒకవైపు ప్రచారం జరుగుతోంది. మరోవైపు మాత్రం డిసెంబర్ తరువాతే అన్న చర్చ నడుస్తోంది. ఇప్పటికే పంచాయితీ ఎన్నికలు పూర్తయ్యాయి.. మున్సిపల్ ఎన్నికలను సైతం పూర్తి చేశారు. ఆ రెండు ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీ పట్టు నిలుపుకుంది. అందుకే ఇప్పుడు అందరి దృష్టి మండల, జిల్లా పరిషత్ ఎన్నికలపై పడింది. కానీ దీనిపై క్లారిటీ మాత్రం రావడం లేదు.

**గత ఏడాది నోటిఫికేషన్..:** వాస్తవానికి గత ఏడాది ప్రాదేశిక ఎన్నికలు పూర్తి చేయాలి. అప్పటికే పాలకవర్గాల గడువు ముగియడంతో సెప్టెంబరు 29న నోటిఫికేషన్ జారీ అయింది. నామినేషన్లు కూడా మొదలయ్యాయి. అయితే బీసీ రిజర్వేషన్లపై పిటిషన్లు విచారణ కారణంగా రాష్ట్ర హైకోర్టు అక్టోబర్ 9న ఇచ్చిన ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. అటు తరువాత హైకోర్టు అనుమతితో గ్రామపంచాయతీలుకు, మున్సిపాలిటీలకు ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు. అయితే ఇప్పుడు రిజర్వేషన్ల విధానం కొలిక్కి రానుండడంతో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధపడుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. అయితే అనేక రకాల అవరోధాలు ఉన్నాయని.. అక్టోబర్ తర్వాత ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం నడుస్తోంది.

**ఓటర్ల జాబితాతో హడావిడి..:** అయితే మొన్న ఆ మధ్యన ఓటర్ల జాబితా పై అధికారులు హడావిడి చేశారు. కానీ తరువాత అంతా సైలెంట్ అయింది. ఇప్పటికే పంచాయితీలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. చివరిగా మండల పరిషత్ లతోపాటు జిల్లా పరిషత్ లను సైతం కైవసం చేసుకుని సత్తా చాటాలని భావిస్తుంది కాంగ్రెస్. రాష్ట్రవ్యాప్తంగా 566 జడ్పిటిసి స్థానాలు, 5773 ఎంపిటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో 31 జిల్లా పరిషత్ స్థానాలు ఉన్నాయి. మేడ్చల్-మల్కాజిగిరిని అర్బన్ జిల్లాగా మార్చడంతో.. అది జిల్లా పరిషత్ ల జాబితా నుంచి తొలగించబడింది. 2019 తర్వాత అనేక గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలో విలీనం అయ్యాయి. అందుకే గ్రామాల సంఖ్య తగ్గింది. గ్రామాల సంఖ్య తగ్గదల కారణంగా మొత్తం 44 ఎంపిటీసీలు, నాలుగు ఎంపీపీలతోపాటు నాలుగు జడ్పిటిసి స్థానాలు తగ్గాయి. అయితే ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉంది. మరి ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి అనేది చూడాలి.

# స్థానిక ఎన్నికల బహిష్కరణ!

వివిధ కారణాలు చెబుతూ స్థానిక సంస్థల ఎన్నికల బహిష్కరణ వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

**చాలా ఇబ్బందికరం..:** ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడం ఇబ్బందికరమే. ఇప్పటికే ప్రజల్లో ప్రభుత్వం పై ఒక రకమైన సంతృప్తి కనిపిస్తోంది. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోంది ప్రభుత్వం. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. పరిశ్రమలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నిరుద్యోగ యువతలో కూడా సంతృప్తి వ్యక్తం అవుతుంది. గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కూడా జరుగుతోంది. అనవసరంగా ఎన్నికలకు వెళ్లి చేతులు కాల్చుకోవడం కంటే.. ఎన్నికల బరి నుంచి తప్పుకుంటే మేలన్న నిర్ణయానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వచ్చాయి. అందుకే ఏమో ఒక కారణాలు చెబుతూ ఎన్నికల బహిష్కరణకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మొగ్గు చూపే అవకాశం ఉంది.

**నియోజకవర్గానికి దూరంగా నేతలు..:** రాష్ట్రవ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు యాక్టివ్ కాలేదు. కొందరైతే అసలు నియోజకవర్గాలకే అందుబాటులో లేరు. వైసీపీకి చెందిన కీలక నేతలు బయట రాష్ట్రాల్లో వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో స్థానిక సంస్థల కోసం ఆసక్తి చూపే నేతలకు అండగా నిలిచే వారు కూడా కరువవుతున్నారు. పైగా స్థానిక సంస్థల ఎన్నికలంటే పెట్టుబడితో కూడుకున్న పని. పైగా ఎవరైనా నాయకులు స్థానిక సంస్థల ఎన్నికలకు నిలబడితే నియోజకవర్గం డబ్బులు సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. అందుకు వైసిపి నేతలు సిద్ధంగా లేరు. ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచినా ఉత్సవ విగ్రహాలు తప్ప ప్రజలకు చేసింది ఏమీ ఉండదు. ఈ కారణంతోనే ఎక్కువమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఎన్నికలకు దూరంగా ఉండాలని భావిస్తోంది. ఈ విషయాన్ని గమనించిన వైసీపీ నాయకత్వం సైతం ఎన్నికల బహిష్కరణ ఉత్తమం అన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో...

# జూన్ 2న కొత్త పింఛన్లు?!

చేసుకున్న వారు ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు బడ్జెట్లో రెండు లక్షల పెన్షన్లతోపాటు రేషన్ కార్డుల పంపిణీకి నిధులు కేటాయించారు. ఇప్పుడు తాజాగా ఆ రెండింటిపై ప్రభుత్వం ముహూర్తం నిర్ణయించింది. దరఖాస్తులు అర్హతలపై నిర్ణయం తీసుకుంది. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ రెండు నుంచి 2 లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ ప్రకటించారు.

**దరఖాస్తులు సైతం..:** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పింఛన్ల మంజూరు తో పాటు రేషన్ కార్డులపై ప్రకటనలు ఇస్తూ వచ్చింది. దరఖాస్తుల స్వీకరణ కూడా జరిగింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చి దాదాపు రెండున్నర సంవత్సరాలు దాటుతున్న క్రమంలో కాంగ్రెస్ సర్కార్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఇప్పుడు రెండో విడతకు తెలంగాణ సర్కార్ సన్నాహాలు చేస్తోంది. అన్నింటికీ మించి పింఛన్ల ప్రక్రియకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో.. లక్షలాదిమంది దరఖాస్తుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**కొత్తగా రెండు లక్షల మందికి..:** ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ లబ్ధిదారులు 42 లక్షల మందికి పైగా ఉన్నారు. కొత్తగా 2 లక్షల మందికి ఆమోదం ఇచ్చినట్లు మంత్రి చెబుతున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మరో రెండు లక్షల పెన్షన్లకు నిధులు కేటాయించి.. జూన్ 2 నుంచి అమలు చేయాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, హెచ్ఐవి బాధితులు, దివ్యాంగులు వంటి వర్గాలకు కొత్తగా పెన్షన్ దక్కనుంది. ప్రస్తుతం వృద్ధులు వితంతువులు మొదలైన వారికి నెలకు రూ.2016, దివ్యాంగులకు రూ.4016 అందిస్తోంది. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పెన్షన్ ను 4000 రూపాయలకు పెంచనున్నట్లు హామీ ఇచ్చింది. అది ఎంతవరకు అమలు కాలేదు. అయితే ఇప్పుడు రేషన్ కార్డులతో పాటు పింఛన్లు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం శుభ పరిణామం.

# బండి భగీరథ్‌పై కఠిన సెక్షన్!

**అత్యంత తీవ్రమైన నేరంగా..:** బాధితురాలు వాంగ్మూలం ప్రకారం తాజాగా భగీరథ్ పై బి ఎన్ 64 (2)(ఎ) సెక్షన్ జత చేశారు. ఈ సెక్షన్ ప్రకారం ఒక మహిళపై పదేపదే లైంగిక దాడి, అత్యాచారం చేసినట్లు నిరూపితమైతే అది అత్యంత తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది. న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ నేరం కోర్టులో రుజువైతే కనీసం 10 సంవత్సరాల జైలు శిక్ష తప్పదని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో జీవిత ఖైదు వరకు వెళ్లే అవకాశం ఉందని న్యాయ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఫోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం వల్ల ఈ వ్యవహారానికి మరింత సునీతత్వాన్ని తీసుకొచ్చింది. బాధితురాలు మైనర్ అయి ఉండే అవకాశాల కోణంలో కూడా పోలీసుల దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

**ప్రతిష్టాత్మకంగా పోలీసులు..** ప్రస్తుతం తెలంగాణలో హై ప్రొఫైల్ కేసుగా ఇది కొనసాగుతోంది. ప్రభుత్వంపై ఒకు రకమైన అనుమానపు చూపులు రావడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది పోలీస్ శాఖ. ఇప్పటికే దర్యాప్తు బృందాలు బాధితురాలు స్టేట్మెంట్ను నమోదు చేశారు. ఫోన్ డేటా, చాట్ రికార్డులు, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు. అవకాశం ఉంటే మరికొందరిని సైతం విచారణ చేపట్టేందుకు సిద్ధపడుతున్నారు. ఈ కేసు పై రాజకీయ నీడ పడడంతో రాష్ట్రవ్యాప్తంగా కేసులో ఏం జరుగుతుందోనన్న ఆసక్తి పెరిగింది. సోషల్ మీడియాలో భగీరథ్ కు మద్దతుగా, వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోస్టులు వైరల్ అవుతున్నాయి. పోలీసుల లోతైన దర్యాప్తులో మరిన్ని ఆధారాలు బయటపడే అవకాశం ఉంది. తాజాగా పోలీసులు జోడించిన సెక్షన్ నిరూపితమైతే కేంద్ర మంత్రి కుమారుడికి మరిన్ని ఇబ్బందులు తప్పవు.

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

### ట్రక్కును ఢీకొన్న కంటెయినర్..పదిమంది మృతి

ముంబై:మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లిఒ బృందందతో వెళుతున్న ట్రక్కును కంటెయినర్ ఢీకొనడంతో పదిమంది దుర్మరణం చెందారు. ముంబై - అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 10 మందికిపైగా మృతిచెందగా, మరో 25 మందికి పైగా గాయపడ్డారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రక్కును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. కంటైనర్ ఢీకొన్న తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతింది. ఘటనాస్థలిలోనే పదిమందికి పైగా మృతిచెందారు.

# బండి భగీరథ్ కేసు వాదిస్తున్న వైసీపీ ఎంపీ!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** బండి సంజయ్ కుమారుడి తరపున వాదనలు వినిపిస్తున్నారు న్యాయవాది నిరంజన్ రెడ్డి. ఆయన గతంలో ప్రముఖ కేసులను వాదించడంతో అందరి దృష్టి ఆయనపై ఉంది. ఒకవైపు పోలీసులు కఠిన సెక్షన్లు నమోదు చేస్తున్నారు. కానీ నిరంజన్ రెడ్డి మాత్రం తనదైన శైలిలో వాదనలు వినిపించారు. ఇటీవల తెలంగాణ హైకోర్టులో బెయిల్ పిటిషన్ పై జరిగిన విచారణపై బలమైన వాదనలు వినిపించ గలిగారు. బాధిత బాలిక చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు డిసెంబరులో జరిగితే.. మార్చిలో న్యాయపరమైన చర్చలు జరిపి.. మే 8న ఫిర్యాదు చేసిన విషయాన్ని నిరంజన్ రెడ్డి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఎప్పుడో జరిగిన ఘటనకు ఇప్పుడు సెక్షన్లను మార్చాల్సిన అవసరం ఏంటని పోలీసుల తీరును ప్రశ్నించారు. అయితే బాలిక వాంగ్మూలం ఉండడం, నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో కోర్టు.. బెయిల్ పిటిషన్ పై నిర్ణయాన్ని వారం రోజులపాటు వాయిదా వేసింది. అటు తరువాత మాత్రమే భగీరథ్ పోలీస్ స్టేషన్లో లొంగిపోయారు. అయితే ఇప్పుడు బలమైన వాదనలు వినిపిస్తున్న నిరంజన్ రెడ్డి పై ఇప్పుడు చర్చ నడుస్తోంది.

**తొక్కిసలాట ఘటన కేసు..** అల్లు అర్జున్ కేసును సైతం వాదించారు న్యాయవాది నిరంజన్ రెడ్డి. 2024 చివర్లో దేశం మొత్తం సంచలనంగా మారింది హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట. పుష్ప 2 సినిమాకు సంబంధించి ప్రీమియర్ షో ల సందర్భంగా జరిగిన తొక్కిసలాట కేసును న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదించారు. ఈ కేసులో అల్లు అర్జున్ అరెస్ట్ అయ్యారు. వెంటనే ఆయనకు బెయిల్ మంజూరు కావడం వెనుక న్యాయవాది నిరంజన్ రెడ్డి ఉన్నారు. అప్పట్లో ఆయన బలమైన వాదనలు వినిపించడంతోనే అల్లు అర్జున్ కు బెయిల్ లభించింది అనేది విశ్లేషకుల మాట.

**వైసీపీ రాజ్యసభ సభ్యుడిగా..** సుప్రీంకోర్టు న్యాయవాదిగా ఉన్న నిరంజన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2022లో వైసీపీ రాజ్యసభకు పంపించింది నిరంజన్ రెడ్డిని. వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఆయన న్యాయ సలహాదారుడిగా కూడా కొనసాగుతున్నారు. ఆయనకు సినీ రంగంపై కూడా పరిచయం ఉంది. కొన్ని సినిమాలను నిర్మించారు కూడా. 2011లో వచ్చిన గగనం సినిమాతో సినిమా రంగంలోకి అడుగు పెట్టారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన ఆచార్య, క్షణం, ఘాజీ, వైల్డ్ డాగ్ వంటి సినిమాలకు నిరంజన్ రెడ్డి నిర్మాతగా వ్యవహరించారు.. ఆయన స్వస్థలం తెలంగాణలోని నిర్మల్ జిల్లా. ఆయన తండ్రి విద్యాసాగర్ రెడ్డి కూడా ప్రముఖ లాయర్ గా రాణించారు. అయితే సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా ఉన్న నిరంజన్ రెడ్డి.. తన వాదనలకు గాను గంటకు రూ.5 లక్షల ఫీజు తీసుకుంటారని తెలుస్తోంది. ప్రముఖుల కేసులను వాదించే సమయంలోనే ఎక్కువగా నిరంజన్ రెడ్డి కనిపిస్తారు. దాదాపు ఆయన వాదనలు వినిపించే కేసుల్లో సక్సెస్ ఉంటుంది. ఇప్పుడు నిరంజన్ రెడ్డి బండి సంజయ్ కుమారుడి కేసు వాదిస్తుండడంతో.. అందరి దృష్టిపడింది. మరి ఆయన వాదనలు ఏ మేరకు పనిచేస్తాయో చూడాలి.

# మమతా బెనర్జీకి షాక్!

పథకాలను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మమత బెనర్జీ టీం ఆత్మరక్షణలో పడింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. సంక్షేమ పథకాల అమలుకు సైతం సిద్ధమవుతోంది. సోమవారం రెండోసారి క్యాబినెట్ సమావేశం జరిగింది. జూన్ 1 నుంచి సంక్షేమ పథకాలు అమలు చేయాలని నిర్ణయించారు.

**అన్నపూర్ణ పథకం అమలు..** ప్రధానంగా అన్నపూర్ణ పథకం అమలు చేసేందుకు బిజెపి కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అర్హులైన మహిళలకు ఈ పథకం కింద నెలకు రూ.3000 ఆర్థిక సాయం అందిస్తారు. ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రవేశం కల్పిస్తారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు. ప్రధానంగా మతపరంగా అందించే సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ నిర్ణయించారు. దీని ప్రకారం మదర్సాలకు అందించే సాయం ఆగిపోయే అవకాశం ఉంది. అదే సమయంలో సిఏఏ చట్టం కింద భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలకు సంక్షేమ పథకాలు అందిస్తామని బెంగాల్ మంత్రి అగ్ని మిత్ర పాల్ ప్రకటించారు.

**వేతన సవరణకు సంఘం..** ఇప్పటికే బెంగాల్లో లక్ష్మీ భండార్ పథకం అమలు అవుతుంది. ఈ పథకం లబ్ధిదారులు ఎటువంటి దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా.. నేరుగా అన్నపూర్ణ పథకానికి అర్హత పొందేలా చూస్తారు. దీనికోసం ప్రత్యేక పోర్టల్ కూడా ప్రారంభిస్తారు. అయితే ప్రధానంగా ఉద్యోగుల్లో విశ్వాసాన్ని పొందేందుకుగాను కొత్త ప్రభుత్వం వేతన సవరణకు సంబంధించిన సంఘాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. దీనిపై ప్రభుత్వ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఓబీసీలకు అందించే పథకాల అమలుకు కొత్త కమిషన్ ఏర్పాటు చేయబోతున్నారు. త్వరలో ప్రభుత్వం కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయనుంది. కేంద్రంతో కలిసి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయబోతున్నట్లు ఇటీవల కొత్త ముఖ్యమంత్రి సువెందు అధికారి ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రారంభంలోనే మమతా బెనర్జీ మార్కు పథకాలకు బ్రేక్ ఇస్తూ కొత్త ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం విశేషం.

# బండి సంజయ్ జపం చేస్తున్న బీఆర్ఎస్!

ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అదే పనిగా విమర్శలు చేస్తున్నారు. వ్యూహాత్మక దాడికి దిగుతున్నారు. వ్యక్తిగత లేదా కుటుంబ పరమైన పొరపాట్లను రాజకీయంగా వాడుకుని.. ప్రత్యర్థిని నైతికంగా దెబ్బతీయడం ద్వారా తెలంగాణలో బిజెపి ఎదుగుదలకు బ్రేకులు వేయాలనేది కేటీఆర్ వ్యూహంగా కనిపిస్తోంది. బండి సంజయ్ ని పదవి నుంచి తప్పించాలని సాగుతున్న దూకుడు డిమాండ్ వెనుక పెద్ద రాజకీయ లెక్క దాగివున్నట్లు అర్థమవుతోంది..

**గతంలో కొట్టిన దెబ్బతో..** బండి సంజయ్ అంటేనే గులాబీ పార్టీ వణికి పోతుంది. దానికి కారణం గత ఎన్నికల ఫలితాలే నిదర్శనం. గులాబీ క్యాడర్ ఓటు బ్యాంకును క్రమంగా బిజెపి వైపు మళ్ళించడంలో సంజయ్ పాత్ర ఉంది. బండి సంజయ్ బిజెపి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో హిందుత్వ సెంటిమెంట్ రాజకీయాలే ఎందుకు కారణం అన్నది విశ్లేషకుల మాట. దానిని గులాబీ పార్టీ నాయకత్వం కూడా బలంగా నమ్ముతోంది. మళ్లీ బండి సంజయ్ కు పగ్గాలు దక్కితే రాజకీయం పూర్తిగా మారిపోతుంది. బీసీ సెంటిమెంట్ తో పాటు అన్ని కలిసి వస్తాయి. గతంలో బిజెపిని ప్రజాదరణ వైపు నడిపించిన కీలక నేతను గనుక డిఫెన్స్ లో పడేస్తే.. బిజెపి క్యాడర్ ధైర్యం దెబ్బతింటుంది. తద్వారా వివిధ కారణాలతో బిజెపిలోకి వెళ్లిన గులాబీ క్యాడర్ను తిరిగి రప్పించుకోవచ్చు అనేది కెసిఆర్ తో పాటు కేటీఆర్ వ్యూహం.

**వ్యూహాత్మక మైండ్ గేమ్..** ప్రస్తుతం గులాబీ పార్టీ టార్గెట్ బండి సంజయ్ అన్నట్టు ఉంది. ఆ పార్టీ శ్రేణులతో పాటు సోషల్ మీడియా కూడా ఈ అంశాన్ని విపరీతంగా ట్రోల్ చేస్తోంది. మైండ్ గేమ్ ఆడుతోంది. ఒక బలమైన జాతీయ పార్టీ కేవలం ఒక్క నాయకుడి చుట్టూనే తిరుగుతోందని.. ఆయనను దెబ్బతీస్తే ఇక కోలుకోదు అని గులాబీ పార్టీ పెద్దలు భావిస్తున్నారు. కానీ దానికి ఎంత మాత్రం అవకాశం లేదన్నది విశ్లేషకుల మాట. తెలంగాణలో బిజెపి వ్యక్తిగత చరిష్మ దాటి.. కాస్త ముందడుగులో నిలిచింది. క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి క్యాడర్ తో పాటు బలమైన నాయకత్వం పుట్టుకొచ్చింది. అందుకే వ్యక్తిగత వివాదాలు నాయకుడి ప్రతిష్టపై తాత్కాలికంగా ప్రభావం చూపుతాయి కానీ.. సిద్ధాంతాలతో నడిచే పార్టీని నిర్వీర్యం చేయలేవు అనేది విశ్లేషకుల మాట. కేవలం బండి సంజయ్ ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది గులాబీ పార్టీ. గతంలో తెలంగాణ సెంటిమెంటును నమ్ముకున్న పార్టీ.. ఇప్పుడు వ్యక్తిగత వ్యవహారాలను ఆసరాగా చేసుకుని రాజకీయాలు చేయాలనుకోవడం మాత్రం జాలి వేస్తోంది.

# ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం

నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నె÷-లకెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ÷-రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గో÷-డలెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.




# కొత్తగా ముగ్గురికి!

(మొదటి పేజీ తరువాయి)

కచ్చితంగా మంత్రివర్గ విస్తరణ చేపట్టేందుకు కాంగ్రెస్ సై కమాండ్ నిర్ణయించింది. దీంతో ఈసారైనా మంత్రి పదవి దక్కించుకోవాలని పలువురు ఆశావహులు ముమ్మర ప్రయత్నాల్లో ఉన్నారు. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాలతో పాటు పనితీరు ఆధారంగా కొందరిని మార్చి అవకాశం ఉందన్న ప్రచారం ఉంది. దీంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. సీనియర్ ఎమ్మెల్యేలతో పాటు సామాజిక ప్రాంతీయ సమీకరణ రీత్యా పలువురికి చాన్స్ ఉంటుందన్న టాక్ నడుస్తోంది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిశారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హోట పుట్టిన ఢిల్లీకి చేరుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి తనకే అవకాశం కల్పించాలని గతంలోని ఆయన



కోరిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి తన ప్రయత్నాలు ముమ్మరం చేసేందుకు ఢిల్లీ బాట పట్టారు. అయితే తెర వెనుక చాలామంది నేతలు ఢిల్లీ వెళ్లి పెద్దలను కలుస్తున్నట్లు తెలుస్తోంది.

**మరో డిప్యూటీ సీఎం...:** మరో బీసీమంత్రికి డిప్యూటీ సీఎం గా అవకాశం ఇవ్వాలని ప్రతిపాదనపై హైకమాండ్ తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం క్యాబినెట్లో ఉన్న ఒక మహిళా మంత్రిత్వ పాటు మరో ఇద్దరు మంత్రులు పదవుల్లో కొనసాగడం పై చర్చలు సాగుతున్నాయి. విజయశాంతితో పాటు కోదండరాంకు ఉన్న అవకాశం పై అంచనాలు వినిపిస్తున్నాయి. పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను క్యాబినెట్లోకి తీసుకొని.. పొన్నం ప్రభాకర్కు ఆ బాధ్యతలు ఇస్తారనే ప్రచారం ఉంది. అయితే మంత్రివర్గ పూర్తి విషయంలో సీఎం రేవంత్ రెడ్డికి హై కమాండ్ పూర్తి స్వేచ్ఛ ఇచ్చే పరిస్థితి ఉంది. దీంతో క్యాబినెట్ లోకి ఎవరికి అవకాశం దక్కుతుంది అనే ఉత్కంఠ కొనసాగుతోంది. జూన్ 2న మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తోంది.

## తిరుచ్చి ఉప ఎన్నికల్లో స్టాలిన్!

(మొదటి పేజీ తరువాయి)

టి వి కే అధినేత, సీఎం విజయ్ రెండు చోట్ల గెలవడంతో.. తిరుచ్చి కి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. అయితే బైపోల్లో మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ పోటీ చేస్తారని పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

**మొన్నటి ఎన్నికల్లో ఓటమి..**

స్టాలిన్ మొన్నటి ఎన్నికల్లో కొళత్తూరులో ఓడిపోయారు. అసెంబ్లీకి వెళ్లే అవకాశాన్ని కోల్పోయారు. అయితే ఇప్పుడు తిరుచ్చి రూపంలో ఆయనకు ఒక అవకాశం ఉంది. అసెంబ్లీలో అడుగు పెట్టేందుకు స్టాలిన్ ఈ అవకాశాన్ని ఎంచుకుంటారనే ప్రచారం తమిళ మీడియాలో జోరుగా సాగుతోంది. సంప్రదాయ ఓటు బ్యాంకుతోపాటు డీఎంకేకు గట్టిపట్టున్న నియోజకవర్గం ఇది. అందుకే గ్రౌండ్ వర్క్ కు ప్రిపేర్ అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తమిళనాడులో విజయ్ హవా నడుస్తోంది. అయితే బై పోల్స్ మరో ఆరు నెలల తర్వాత జరిగే అవకాశం ఉంది. అప్పటికి ఇదే పరిస్థితి ఉంటుందా లేదా అనే అనుమానం కూడా ఉంది. మొన్నటి ఎన్నికల తరువాత ఒక ఎత్తు.. అధికారం కోసం ఇతర పార్టీలతో కలిసిన తరువాత మరో ఎత్తు అన్నట్టు ఉంది విజయ్ ఇమేజ్ పరిస్థితి. అందుకే స్టాలిన్ పట్టు బిగిస్తున్నట్లు అర్థం అవుతోంది.

**ప్రజల్లో సానుభూతి..**

రాజకీయ అనుభవం ఉన్న స్టాలిన్ ఓడిపోవడం సంచలనం మాత్రమే కాదు. ఆయనపై సానుభూతి కూడా ప్రజల నుంచి వస్తోంది. ఆయన లాంటి నాయకుడు అసెంబ్లీలో ఉండాలని భావన సామాన్య వాటర్లలో వ్యక్తమవుతోంది. పైగా తిరుచ్చి లో విజయ్ ఏకపక్షవిజయం దక్కించుకోలేదు. ఆయన పాతికవేల ఓట్లతోనే గెలిచారు. అది కూడా త్రిముఖ పోటీలో. అయితే ఇప్పుడు డీఎంకే గట్టిగా ప్రయత్నం చేస్తే కచ్చితంగా వర్కౌట్ అవుతుంది. పైగా అన్న డీఎంకే పార్టీని విజయ్ చీల్చారు. ఆ పార్టీ శ్రేణుల్లో విజయ్ పై కోపం ఉంది. అందుకే ఆ ద్రవిడ పార్టీలు రెండు కలిసి స్టాలిన్ కోసం పని చేస్తే మాత్రం సునాయాస విజయం దక్కుతుంది. స్టాలిన్ పోటీ చేస్తే మాత్రం అన్నాడీఎంకే తప్పకుండా మద్దతు తెలిపే అవకాశం ఉంది. మొత్తానికైతే ఇందుకు సంబంధించిన గ్రౌండ్ వర్క్ ప్రిపరేషన్ లో స్టాలిన్ ఉన్నట్లు తెలుస్తోంది.

## హైదరాబాద్ నడిబొడ్డున ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)



చేస్తున్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి క్యాడర్ కోసం ఆయన వ్యూహాత్మకంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని అడ్డం పెట్టుకున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీ మేరకు విగ్రహ ఏర్పాటులో నిమగ్నమయ్యారు.

**అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో..**

హైదరాబాద్ నగరంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతం అమీర్ పేట చౌరస్తా. అక్కడ ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి పనులు మొదలయ్యాయి. ప్రధానంగా సెటిలర్స్ తో పాటు టిడిపి సానుభూతిపరులు ఎక్కువగా ఉండే ప్రాంతం అది. వారిని టార్గెట్ చేసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని అర్థం అవుతుంది. ఒక్క అమీర్ పేట లోనే కాకుండా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాట్లకు కూడా సీఎం రేవంత్ రెడ్డి పార్ట్ పార్ట్ అందిస్తున్నారు.

**టిడిపి క్యాడర్ చేజారకుండా..**

తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి నాయకత్వం లేకపోవచ్చు కానీ.. క్యాడర్ ఉంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు ఖమ్మం వంటి ప్రాంతాల్లో ఇప్పటికీ టిడిపి బలం చెక్కుచెదరలేదు. గత ఎన్నికల్లో రేవంత్ ను తమ వాడిగా భావించింది టిడిపి క్యాడర్. కెసిఆర్ చర్యలతో టిడిపి పూర్తిగా డీలా పడింది. ఈ పరిస్థితుల్లో రేవంత్ రూపంలో వారికి కేసీఆర్ పార్టీకి బుద్ధి చెప్పే అవకాశం దక్కింది. అలా గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఓటు వేసింది టిడిపి క్యాడర్. అయితే ఈసారి టిడిపి ఓట్లను దక్కించుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి తెలంగాణలో. జూబ్లీహిల్స్ బై పోల్ సమయంలో పెద్ద డిబేట్ కూడా జరిగింది దీనిపై. అయితే టిడిపి ఓటు బ్యాంకు తన నుంచి చేజారకుండా రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సమయంలోనే అమీర్ పేటలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని ఇప్పుడు నిలబెట్టుకున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటు పనులు మొదలయ్యాయి. ప్రస్తుతం పనులు ప్రారంభించారని.. ఇది పూర్తయిన వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరిస్తారు. మరోవైపు ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ప్రతిపాదించిన వంద అడుగుల ఎన్టీఆర్ విగ్రహం, ఎన్టీఆర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు కూడా రేవంత్ సర్కార్ సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో అత్యధికంగా 44.3 డిగ్రీలు

**ఎపిలో మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు**

**అప్రమత్తంగా ఉండాలని వాతావరణ అధికారుల హెచ్చరిక**

అమరావతి,మే18(ఆర్ఎన్ఎ): రాబోయే మూడు రోజుల పాటు కోస్తాంధ్ర జిల్లాల్లో ఎండ తీవ్రత మరింత పెరిగి అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. పలు జిల్లాల్లో 45 నుంచి నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించారు. సోమవారం నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో అత్యధికంగా 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, కడపలో 42.9నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు తీవ్రరూపం దాల్చడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44 నుంచి - 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40-42 ల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45-47 ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. నెల్లూరు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44- 45ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 41 - 43ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45- 47ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం.

## సువేందు అధికారి హత్య కేసు

**షూటర్‌ను యూపిలో అరెస్ట్ చేసిన సిబిఐ**

కోల్‌కతా:పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రథ్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. చంద్రనాథ్‌ను కాల్చిచంపిన షూటర్ రాజ్‌కుమార్‌ను ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో సీబీఐ సోమవారంనాడు అరెస్టు చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ పోలీసుల సాయంతో ఈ అరెస్టు జరిగింది. ఇప్పటికే ట్రాన్సిట్ రిమాండ్ తీసుకున్న సీబీఐ మంగళవారం నాడు కోల్‌కతాలోని సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు అతన్ని హాజరుపరచనుంది. సువేందు అధికారికి అత్యంత విశ్వసనీయుడుగా చంద్రనాథ్ రథ్‌కు పేరుంది. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన రెండ్రోజుల తర్వాత మే 6వ తేదీ రాత్రి చంద్రనాథ్ కోల్‌కతా వెళ్తుండగా నార్త్ 24 పరగణాల జిల్లాలోని దోల్తాలో హత్యకు గురయ్యారు. మోటార్ బైక్‌పై వచ్చిన దుండగులు అత్యంత సమీపం నుంచి ఆయనపై కాల్పులు జరిపారు. ఈ హత్య కేసును తొలుత సిట్ చేపట్టింది. చంద్రనాథ్ కుటుంబానికి న్యాయం చేస్తానని వాగ్దానం చేసిన సీఎం ఆ తర్వాత కేసును సీబీఐకి అప్పగించారు.

## విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం

**బోర్డు తిప్పేసిని సిడి దశరథ్ కన్సల్టెన్సీ**

హైదరాబాద్ : మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. హఫీజ్‌పేట్‌లో సీడీ దశరథ్ కన్‌స్టలెన్సీ బోర్డు తిప్పేసింది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను ముగ్గురు నిందితులు మోసం చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ. 6లక్షలు చొప్పున వసూలు చేశారు. నిందితులు అర్చన, సోమశేఖర్, రాజేంద్రప్రసాద్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారికోసం పోలీసులు గాలింపు చేపట్టారు. బాధితులు ఎంతమంది ఉన్నారనే అంశంపై విచారణ కొనసాగిస్తున్నారు.

## గోవులను తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకోండి

**డిజిపి ఆనంద్‌కు ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ**

హైదరాబాద్: తెలంగాణలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. శనివారం రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని.. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని.. హిందువైనా, ఎంఐఎం నాయకులైనా ఒకే విధంగా చూడాలని అన్నారు. గోవుల అక్రమ రవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు.. రాజకీయ ఒత్తిడికి లోనుకాకుండా పని చేయాలని తెలిపారు. హిందువులపై మాత్రమే చర్యలు తీసుకుంటే ప్రజల్లో అనుమానాలు వస్తాయన్నారు. గోమాతను కాపాడాలని చెప్పే ప్రభుత్వం.. అక్రమ రవాణాను ఎందుకు ఆపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఎవరైనా చట్టం ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ డీజీపీ వెంటనే ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని రాజాసింగ్ లేఖలో స్పష్టం చేశారు.

## వివాహిత దారుణ హత్య

**ఘటనపై పోలీసుల దర్యాప్తు**

మంచిర్యాల,మే18(ఆర్ఎన్ఎ): చెన్నూర్ మండలంలోని ఏళ్ళక్కపేట గ్రామంలో దారుణం జరిగింది. చల్ల శారద (24) అనే వివాహితను గుర్తు తెలియని దుండగులు అతి కిరాతకంగా హత్య చేశారు . సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ఘటన స్థలాన్ని పరిశీలించి హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. మరోవైపు శారద హత్యతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. శారదను హత్య చేసిన దుండగులు పోలీస్ స్టేషన్ లోనే ఉన్నారని.. నిందితులను తమకు అప్పగించాలంటూ మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు చెన్నూర్ పోలీస్ స్టేషన్‌పై రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డట్లు సమాచారం. దీంతో పోలీస్ స్టేషన్ దగ్గర ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా.. అధికారులు రంగంలోకి దిగి ఆందోళనకారులను శాంతింపజేశారు.

## శంషాబాద్‌లో తప్పిన విమాన ప్రమాదం

**500 మీటర్ల ఎత్తులో విమానాన్ని ఢీకొన్న పక్షి**



హైదరాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎయిర్ ఇండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం బెంగళూరు నుంచి శంషాబాద్‌కు ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతున్న సమయంలో విమానాన్ని పక్షి ఢీకొట్టింది. ఆ సమయంలో విమానంలో 76 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. దాదాపు 500 మీటర్ల ఎత్తులో విమానాన్ని పక్షి ఢీకొన్నట్లు పైలట్ గుర్తించారు. వెంటనే ఈ ఘటనపై అధికారులకు సమాచారం అందించారు. పైలట్ అప్రమత్తతతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం సురక్షితంగా ల్యాండింగ్ అయ్యింది. దీంతో విమానంలోని ప్రయాణికులతో పాటు ఎయిర్‌పోర్ట్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్ట్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు విమానాలను పక్షులు ఢీకొన్న ఘటనలు మూడు నమోదు అయినట్లు తెలుస్తోంది. బర్డ్ స్ట్రైక్ ఘటనలు తరచుగా జరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సమీప ప్రాంతాల్లో పక్షుల నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఎయిర్‌పోర్ట్ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.



Telugu text: తెలంగాణ ఒకప్పుడు దేశానికే అన్నపూర్ణగా, ఆర్థిక చోదక శక్తిగా వెలుగొందిన రాష్ట్రం. కానీ, 2026 మే మాసపు ఎండల కంటే తీవ్రంగా ఇప్పుడు రాష్ట్ర ఖజానాను ఆర్థిక సెగలు వేధిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్న వేళ, అటు ప్రజాకర్షక పథకాల అమలుకు, ఇటు గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన అప్పుల భారానికి మధ్య సగటు తెలంగాణ పౌరుడు నలిగిపోతున్నాడు. ఒకవైపు అభయహస్తం హామీల అమూలు కోసం ఆరాటం, మరోవైపు అడుగంటుతున్న ఆదాయం వెరసి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ఒక అస్థిరమైన మలుపు వద్ద నిలబడింది.రాష్ట్ర ఆర్థిక శాఖ లోతుల్లోకి తొంగిచూస్తే కనిపిస్తున్న అంకెలు సామాన్యుడిని భయపెట్టక మానవు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర మొత్తం అప్పు దాదాపు ?7.5 లక్షల కోట్లకు చేరుకుందని ఆర్థిక నిపుణుల అంచనా. ఇందులో గత బిఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల కాలంలో చేసిన అప్పులతో పాటు, గత 20 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సేకరించిన కొత్త రుణాలు కూడా ఉన్నాయి.అయితే, ఈ అప్పుల స్వభావంపైనే ఇప్పుడు మేధావుల మధ్య పెద్ద చర్చ నడుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులు మెజారిటీగా కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం వెచ్చించగా, ప్రస్తుతం జరుగుతున్న వ్యయంలో సింహభాగం సంక్షేమ పథకాల (ఔవశ్రీఝతీవ ూఎష్ట్రవవఎవం) వైపు మళ్లుతోంది. ఉత్పాదక రంగం కంటే అనుత్పాదక రంగంపై పెరుగుతున్న ఈ వ్యయం రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలను దెబ్బతీసే ప్రమాదం ఉందన్నది కాదనలేని వాస్తవం.రాష్ట్ర ఖజానా పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే నెలాఖరు రాకముందే ఉద్యోగుల జీతాలకు, పెన్షన్లకు నిధులు ఎక్కడ నుండి తేవాలో తెలియక ఆర్థిక శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని నిశితంగా పరిశీలిస్తే, గణాంకాలు అత్యంత ఆందోళనకరమైన వాస్తవాలను ఆవిష్కరిస్తున్నాయి. 2025-26 అంచనాల ప్రకారం, తెలంగాణ రాష్ట్ర మొత్తం అప్పు గడిచిన పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా 7,50,000 కోట్ల భారీ అంకెకు చేరుకుంది. ఈ అప్పుల ఊబి ఎంత లోతుగా ఉందంటే, కేవలం వార్షిక వడ్డీల చెల్లింపులకే ఖజానా నుండి ప్రతి ఏటా ?40,000 కోట్లకు పైగా నిధులు కరిగిపోతున్నాయి. మరోవైపు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆరు గ్యారంటీల అమలు కోసం నెలకు ?6,000 కోట్లకు పైగా అదనపు భారం పడుతోంది.ఈ స్థాయిలో వ్యయం పెరుగుతున్నా, ఆదాయ మార్గాలు మాత్రం ఆశించిన స్థాయిలో మెరుగుపడటం లేదు. రాష్ట్ర సొంత ఆదాయం ?90,000 కోట్లు ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, వాస్తవ రాబడి ఆ లక్ష్యం కంటే 18 శాతం వెనుకబడి ఉండటం గమనార్హం. ఇలా అడుగంటుతున్న ఆదాయం, పెరుగుతున్న అప్పుల మధ్య ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల కోసమే ఏటా 65,000 కోట్లకు పైగా కేటాయించాల్సి రావడంతో, రాష్ట్ర ఆర్థిక నౌక తీవ్రమైన ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది.2014 నుండి 2023 వరకు తెలంగాణను పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి ఒక దృఢమైన మౌలిక పునాదిని నిర్మించిందనడంలో సందేహం లేదు. నాడు కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల తెలంగాణ ఎడారి కాకుండా పచ్చని మాగాణంగా మారింది. మిషన్ కాకతీయ ద్వారా చెరువులకు పునర్జీవం పోయడం, రైతు బంధుతో పెట్టుబడి సాయం అందించడం వంటి చర్యలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయి.అయినప్పటికీ, ఈ ప్రాజెక్టుల కోసం కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న అప్పులు నేడు కాంగ్రెస్ ప్రభుత్వానికి గుదిబండగా మారాయి. ఆనాడు తీసుకున్న రుణాలకు సంబంధించి కేవలం వడ్డీల రూపంలోనే ప్రతి ఏటా వేల కోట్లు చెల్లించాల్సి వస్తోంది. అయితే, నాడు నిర్మించిన రోడ్లు, 24 గంటల

# నాడు పునాదులు.. నేడు ప్రశ్నార్థకాలు

కరెంటు సరఫరా వ్యవస్థ, ఐటీ రంగ విస్తరణ నేటికీ రాష్ట్ర ఆదాయానికి ప్రధాన వనరులుగా ఉన్నాయి. ఈ వారసత్వ సంపద ను కాపాడుకుంటూనే, అప్పుల ఊబి నుంచి గట్టెక్కడం ప్రస్తుత ప్రభుత్వానికి అతిపెద్ద సవాలు.మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు ?2500 సాయం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గృహజ్యోతి వంటి పథకాలు ఓటర్లను ఆకర్షించాయి. కానీ, అమలు దశకు వచ్చేసరికి ఖజానా ఖాళీగా ఉండటం ప్రభుత్వానికి మింగుడు పడటం లేదు. ముఖ్యంగా రైతు రుణమాఫీ హామీపై రైతులు గొంతెత్తుతున్నారు. ?2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న మాట కొన్ని జిల్లాల్లో పాక్షికంగానే అమలు కావడంతో అన్నదాతల్లో అసహనం పెరుగుతోంది.కేంద్రం నుంచి రావాల్సిన జీఎస్టీ పరిహారం నిలిచిపోవడం, పన్నుల వాటా తగ్గడం వంటి అంశాలు రాష్ట్రాన్ని మరింత ఇరుకున పెట్టాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లో కొన్ని శాఖల ఉద్యోగులకు జీతాలు 15వ తేదీ వరకు కూడా పడకపోవడం రాష్ట్ర ఆర్థిక క్రమశిక్షణ తప్పిందనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.నిధుల కొరత వల్ల రాష్ట్రంలో కొత్త ప్రాజెక్టులు వేగం పుంజుకోవడం లేదు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గతంలో మంజూరైన అనేక రహదారుల నిర్మాణాలు నిలిచిపోయాయి. దీనివల్ల రియల్ ఎస్టేట్ రంగంపై కూడా ప్రభావం పడుతోంది. పాత ప్రభుత్వం నిర్మించిన భవనాలు, సదుపాయాలు వాడుకలో ఉన్నప్పటికీ, కొత్తగా ఒక్క ఇటుక కూడా పడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఖజానా ఎందుకు ఖాళీ అవుతోంది? (ప్రధాన కారణాలు) గ్యారంటీల భారం వలన ఆదాయం పెరగకపోయినా, సంక్షేమ పథకాల కోసం అధికంగా ఖర్చు చేయడం.వడ్డీల మాయాజాలంతో పాత అప్పుల వడ్డీలే కొత్త అప్పులు పుట్టకుండా అడ్డుపడుతున్నాయి.కేంద్రం సహాయ నిరాకరణ కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధుల కేటాయింపులో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం.ఆదాయ లక్ష్యాలు రీచ్ కాకపోవడం స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, మద్యం ద్వారా వచ్చే ఆదాయం ఆశించిన స్థాయిలో పెరగకపోవడం.నిర్వహణ లోపాలు ఆర్థిక వనరుల సమీకరణలో ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం.ముందున్న మార్గం పునర్నిర్మాణం సాధ్యమేనా? ఈ సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా, కఠినమైన ఆర్థిక సంస్కరణలు చేపట్టాల్సి ఉంది. ఐటీ రంగంతో పాటు ఫార్మా, తయారీ రంగాల్లోకి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఉపాధిని, ఆదాయాన్ని పెంచుకోవాలి.అనవసరపు ఆడంబరాలకు స్వస్తి పలికి, సంక్షేమ పథకాలలో లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా మార్చాలి. రాజకీయ విభేదాలు పక్కన పెట్టి, రాష్ట్రానికి రావాల్సిన వాటాను సాధించుకోవడంలో రాజీ పడకూడదు. బిఆర్ఎస్ హయాంలో నిర్మించిన మౌలిక వసతులను (Infrastructure) ఆదాయ వనరులుగా మార్చుకోవాలి.తెలంగాణ ఆర్థిక వ్యవస్థ నేడు ఒక అగ్ని పరీక్షను ఎదుర్కొంటోంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, సామాన్య ప్రజల కడుపు నిండాలి, రాష్ట్ర ప్రగతి ఆగకూడదు. కేవలం గ్యారంటీలు ఇవ్వడమే కాదు, ఆ గ్యారంటీలను నిలబెట్టుకునే ఆర్థిక శక్తిని కూడా ప్రభుత్వం కూడగట్టుకోవాలి. గత ప్రభుత్వం వేసిన పునాదులపై బలమైన సౌధాన్ని నిర్మించాల్సిన బాధ్యత ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్‌పై ఉంది. అప్పుల ఊబి నుంచి తెలంగాణను రక్షించి, అభివృద్ధి పథంలో నడిపించడమే ఈ ప్రభుత్వానికి అసలైన విజయం. ప్రజలు మాటల కంటే చేతలను, అంకెల కంటే అభివృద్ధిని కోరుకుంటున్నారు.

# ఓటమి అంచున ఉన్నారా?

## అయితే ఈ నాద ఔషధం మీ కోసమే!

**జీవితం అనే మహాసముద్రంలో అలలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. అన్నీ సజావుగా సాగిపోతున్నంత కాలం మనకు అంతా మన వల్లే జరుగుతోందనే భ్రమ ఉంటుంది. అక్కడ అస్సలు విశ్వాసానికి పనే లేదు. కానీ, ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై, చీకటి ముసురుకుని, నలువైపులా ఉన్న దారులన్నీ మూసుకుపోయినప్పుడు కనురెప్పల చాటున దాచుకున్న కన్నీళ్లు వరదలా ఉప్పొంగినప్పుడు మనిషి తొలిసారిగా తన అహాన్ని పక్కన పెట్టి, మనస్ఫూర్తిగా ఆ సృష్టికర్తను స్మరించుకుంటాడు.**

గొంతు విప్పి ఆర్తిగా పిలుచుకుంటాడు. అవును, సరిగ్గా ఆ క్షణంలోనే మనిషిలో అసలైన ఆధ్యాత్మికత చిగురిస్తుంది. ప్రతికూల పరిస్థితుల సుడిగుండంలో చిక్కుకున్నప్పుడే మన నమ్మకానికి, అంతరంగ బలానికి నిజమైన పరీక్ష ఎదురవుతుంది.ఇలాంటి ఆర్తితో కూడిన వేదనలో, వైఫల్యపు అగాధంలో కూరుకుపోయిన హృదయానికి ఊరటనిచ్చే ఒకే ఒక దివ్యౌషధం "శంకరా నాదశరీరాపరా" అనే పవిత్ర స్తుతి. ఇది కేవలం సంగీత ప్రపంచానికి సంబంధించిన కొన్ని స్వరాల కలయిక మాత్రమే కాదు.విరిగిపోయిన మనిషి మనసుకు ప్రశాంతతను, కొత్త ఆశను చేకూర్చే ఒక అతీత నాదం. జీవితంలో అన్నీ కోల్పోయి, ఇక నావల్ల కాదు అని చేతులెత్తేసే తరుణంలో, వెనుక నుంచి ఒక అదృశ్య హస్తంలా వచ్చి మన చేయి పట్టి పైకి లేపే చైతన్య శక్తి ఈ నాదం!ఆదిశంకరాచార్యులు అనుగ్రహించిన ఈ అద్భుతమైన భావనలో ఒక పరమార్థం ఉంది. ఆయన పరమశివుడిని నాదశరీరుడు అని కీర్తించారు. అంటే, ఆ ముక్కంటికి ప్రత్యేకమైన రూపం అక్కర్లేదు, నాదమే ఆయన దేహం. ఇక్కడ నాదం అంటే కేవలం చెవులకు వినబడే ధ్వని మాత్రమే కాదు, అది విశ్వమంతటా ప్రవహించే ప్రాణశక్తి. ప్రకృతిలోని ప్రతి అణువులోనూ నిరంతరం ప్రతిధ్వనించే జీవ స్పందన. ఎప్పుడైతే మనిషి శ్రద్ధతో ఆ నాద తరంగాలలో లీనమవుతాడో, అప్పుడు అతని హృదయ భారమంతా కరిగిపోతుంది. తనను కుంగదీస్తున్న బాధలను, ఓటములను అధిగమించగల అద్భుతమైన ఆత్మస్థైర్యం అతనిలో మేల్కొంటుంది. కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతూ, ఈ పవిత్ర నాదాన్ని ఆశ్రయించి తమ వైఫల్యాలను అద్భుత విజయాలుగా మార్చుకున్న మహానుభావుల గాథలు మన చరిత్రలో ఎన్నెన్నో ఉన్నాయి.ప్రస్తుత ఆధునిక సమాజంలో వైద్యులు మన శరీరానికి వచ్చే రకరకాల వ్యాధులను నయం చేయగలరు. మనస్తత్వవేత్తలు (సైకాలజిస్టులు) మనసును వేధించే ఆందోళనలను, మానసిక ఒత్తిడిని కొంతవరకు తగ్గించగలరు. కానీ, ఆత్మకు తగిలిన గాయాన్ని మాన్పగల ఏకైక పరమ వైద్యుడు మాత్రం ఆధ్యాత్మికత మాత్రమే.ఒక వ్యాపారవేత్త రాత్రింబగళ్లు కష్టపడి, తన జీవితకాలమంతా కూడబెట్టిన సామ్రాజ్యం ఒక్క రాత్రిలో కుప్పకూలిపోయినప్పుడు ఒక విద్యార్థి ఎన్నో ఆశలతో రాత్రిళ్లు మేల్కొని చదివి, చివరకు పరీక్షల్లో వరుసగా విఫలమైనప్పుడు లేదా కంటికి రెప్పలా చూసుకున్న కన్నబిడ్డను కోల్పోయి ఏడుస్తున్న ఒక తల్లిని చూసినప్పుడు ఆ గుండె కోతను, ఆ వేదనను తట్టుకోగల శక్తి ప్రపంచంలోని ఏ మందుల షాపులోనూ దొరకదు. అది కేవలం శ్రద్ధలో, దైవచింతనలో, నిశ్చలమైన నమ్మకంతో శంకరుని పాదాల చెంత మోకరిల్లి చేసే శరణాగతిలో మాత్రమే లభిస్తుంది. ఆధ్యాత్మికత అంటే సంసారాన్ని వదిలేసి అడవుల్లోకి పారిపోవడం కాదు. సమాజానికి భయపడి దూరంగా వెళ్ళడం అస్సలు కాదు. అది మనల్ని మనమే అంతర్గతంగా బలోపేతం చేసుకోవడం. మన లోపలి వ్యక్తిత్వాన్ని, మానసిక దృఢత్వాన్ని ఒక సుస్థిరమైన కోటలా నిర్మించుకోవడం. బాహ్య ప్రపంచంలో ఎన్ని తుఫానులు విరుచుకుపడినా, లోపల ఉన్న ఆత్మవిశ్వాస స్తంభం ఏమాత్రం కదలకుండా నిలబడగలగడమే ఆధ్యాత్మికత మనకు ప్రసాదించే అసలైన దైవబలం. ఈ అస్త్రం సంపాదించుకున్నవారు జీవితంలో ఎక్కడా శాశ్వతంగా ఓడిపోరు. ఒకవేళ కింద పడినా, మునుపటికంటే రెట్టింపు వేగంతో మళ్లీ పైకి లేవడం వారికి తెలుసు.దీనికి ఉదాహరణగా మన కళ్లముందే జరిగిన ఒక యథార్థ సంఘటనను చెప్పుకోవచ్చు. భాగ్యనగరంలో నివసించే రవిచంద్ర వయసు 42 ఏళ్లు. ఎన్నో కలలతో, కష్టపడి ఒక చిన్న సాఫ్ట్‌వేర్ స్టార్టప్ కంపెనీని ప్రారంభించాడు. మూడేళ్లపాటు రాత్రిని పగలు చేస్తూ శ్రమించినా దురదృష్టవశాత్తూ కంపెనీ పూర్తిగా మూతపడింది. అప్పులవాళ్ల ఒత్తిడి పెరిగిపోయింది. అదే సమయంలో ఇంట్లో భార్య తీవ్ర అనారోగ్యానికి గురైంది. పిల్లల చదువులు, భవిష్యత్తు పూర్తిగా ప్రశ్నార్థకంగా మారాయి.అలాంటి ఒక దిక్కుతోచని చీకటి రాత్రి, తీవ్రమైన నిరాశతో అతను స్థానిక శివాలయానికి వెళ్లాడు. అక్కడ కూర్చుని ఉండగా, మైకులో ఎక్కడో వినబడుతున్న "శంకరా నాదశరీరాపరా" అనే కీర్తన అతని చెవుల్లో పడింది. ఆ నాద తరంగాలు అతని అంతరాత్మను బలంగా తాకాయి. కళ్లవెంట నీళ్లు ధారలుగా కారాయి. కానీ, చిత్రంగా ఆ కన్నీళ్లతోపాటే అతని మనస్సులోని ఆందోళన, భారం అంతా కొట్టుకుపోయి తేలికపడింది. నా వెనుక ఒక శక్తి ఉందనే కొండంత ధైర్యం వచ్చింది. మరుసటి రోజు ఉదయం సరికొత్త ఉత్సాహంతో, కొత్త ప్రణాళికతో మళ్లీ ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఈ రోజు అతని సంస్థ తిరిగి లాభాల బాట పట్టి విజయవంతంగా నడుస్తోంది. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూఆ భయానక



రాత్రి నాకు మానసిక స్థైర్యాన్ని ఇచ్చింది కేవలం నా నమ్మకమే, ఆ నాదంలో ఉన్న శక్తే నన్ను బతికించింది అని గద్గద స్వరంతో చెప్తాడు.ఇది కేవలం ఒక రవిచంద్ర కథ మాత్రమే కాదు. ప్రతి నిత్యం పోరాడుతున్న కోట్లాదిమంది తెలుగువారి జీవిత కథ. కష్టకాలంలో మన పూర్వీకులు ఎప్పుడూ లబోదిబోమంటూ కూర్చోలేదు. వారు సంగీతంలో, భక్తి కీర్తనలలో ఓదార్పును వెతుక్కున్నారు. అన్నమాచార్యుల ఆర్తి కీర్తనలు, త్యాగరాజ స్వామి వారి పంచరత్న కృతులు, భక్త రామదాసు చెరసాల నుంచి పాడిన కీర్తనలు ఇవన్నీ జీవితంలోని తీవ్రమైన వైఫల్యాల, కష్టాల గురుకులంలోంచి పుట్టుకొచ్చిన అమృత కావ్యాలే. వాటి వెనుక అంతులేని వ్యక్తిగత బాధ ఉంది. కానీ, ఆ బాధను అధిగమించి ముందు నిలిచింది మాత్రం అచంచలమైన విశ్వాసం. ఆ విశ్వాసమే వారిని చరిత్రలో చిరస్మరణీయులుగా నిలిపింది.

నిజానికి విశ్వాసం అంటే కళ్లు మూసుకుని అంతా అదే సర్దుకుంటుందిలే అని మూఢంగా కూర్చోవడం కాదు. విశ్వాసం అంటే నా జీవితంలో ఎలాంటి విపత్తులు వచ్చినా, ఏం జరిగినా నేను బండరాయిలా తట్టుకుని నిలబడగలను అని మనస్ఫూర్తిగా నమ్మడం. ఈ చిన్న వ్యత్యాసాన్ని గ్రహించడం చాలా ముఖ్యం. ఆదిశంకరుల నాదశరీర తత్వం మనకు బోధించే పరమార్థం కూడా ఇదే. పరమశివుడు నాద రూపుడై ఈ విశ్వంలో ప్రతిక్షణం మోగుతూనే ఉన్నాడు. ఆ సార్వత్రిక నాదానికి మన అహాన్ని, భయాలను పూర్తిగా అప్పగించేసినప్పుడు జీవితంలో బాధలు ఎదురైనా, ఆ బాధను భరించే మనిషి బలహీనుడు కాడు. ఆ కష్టాల ద్వారా అతను మరింత శక్తివంతుడిగా రూపాంతరం చెందుతున్నాడని అర్థం.

కష్టం ఎదురవనంత వరకు మనలో ఎంత విశ్వాసం ఉందో మనకే తెలియదు. పరీక్ష ఎదురైతేనే కదా మన అసలు బలం ఏంటో బయటపడేది! ఆ మానసిక బలాన్ని, స్థిరత్వాన్ని భగవన్నామ స్మరణ అందిస్తుంది.

ప్రార్థన ఇస్తుంది. "శంకరా నాదశరీరాపరా" అని హృదయపూర్వకంగా ఆలపించే వ్యక్తికి తన చుట్టూ బాహ్య ప్రపంచంలో ఎంత గందరగోళం, అలజడి ఉన్నప్పటికీ అంతరంగంలో ఒక అద్భుతమైన నిశ్శబ్దం, ప్రశాంతత ఏర్పడతాయి. ఆ నిశ్శబ్దంలోనే సత్యం సాక్షాత్కరిస్తుంది. ఆ సత్యమే మనకు విజయపథం వైపు దారి చూపిస్తుంది.చాలామంది అనుకున్నట్టు ఆధ్యాత్మికత అనేది కేవలం పూజా గదులకో, దేవాలయాలకో పరిమితమైన విషయం కాదు. అది మనం వేసే ప్రతి అడుగులోనూ, ప్రతి ఆలోచనలోనూ ప్రతిఫలించాలి. ఓటమిని చూసి కుంగిపోయి పారిపోకుండా, విజయం వస్తే తలకెక్కించుకుని అహంకరించకుండా, సుఖదుఃఖాలు రెండింటినీ సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగడమే నిజమైన ఆధ్యాత్మిక జీవనం. ఈ విశాలమైన దృక్కోణంతో బతికే మనిషికి వైఫల్యం అనేది ఒక శాపంగా అనిపించదు అది తన వ్యక్తిత్వ వికాసానికి, పరిణామ క్రమానికి దేవుడు ఇచ్చిన ఒక చక్కని మెట్టుగా కనిపిస్తుంది.నేటి నిరాశే రేపటి విజయానికి బలమైన ప్రేరణ అవుతుంది. ఈ రోజు కంటి నుంచి కార్చే కన్నీళ్లే రేపటి దృఢ సంకల్పానికి ఇంధనంగా మారుతాయి. ఈ అద్భుతమైన మార్పు మనలో సాధ్యం కావాలంటే శంకరుని నాదం వంటి ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక స్పందన మన అంతరంగంలో నిరంతరం జాగృతం కావాలి. అందుకే పూర్వకాలం నుండి ప్రతి తెలుగు ఇంట్లోనూ పెద్దలు పిల్లలకు ఒక అద్భుతమైన జీవన సూత్రాన్ని నేర్పారు.బాబూ! కష్టం వస్తే మొదట ఆ దేవుడిపై భారం వేసి ప్రశాంతంగా ప్రార్థించు, ఆపై నీ శాయశక్తులా కష్టపడు ఫలితం దానంతట అదే వస్తుంది.మన సనాతన హిందూ తాత్విక చింతనలో "నాదబ్రహ్మ" అనే ఒక ఉన్నతమైన భావన ఉంది. అంటే నాదమే సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపం. ఆ బ్రహ్మనాదం మన గుండె చప్పుడులో నిరంతరం మోగుతూనే ఉంది. ఎప్పుడైతే మనం బాహ్య ప్రపంచంలోని అనవసరపు అరుపులను పక్కన పెట్టి, లోపలి నాదాన్ని శ్రద్ధగా వినడం అలవాటు చేసుకుంటామో, అప్పుడు మనం ఈ అనంతమైన విశ్వంలో ఒక భాగమనే పరమసత్యం బోధపడుతుంది. ఆ సత్యాన్ని గ్రహించిన మనిషికి జీవితంలో ఒంటరితనం అనేదే ఉండదు. రేపటి గురించిన భయం అసలే వేధించదు. అతనికి వైఫల్యం అనేది ప్రయాణానికి ముగింపులా అనిపించదు, సరికొత్త అధ్యాయానికి ఆరంభంలా కనిపిస్తుంది.ప్రస్తుత సైన్స్ యుగంలో కూడా, శంకరాచార్యుల నాదశరీర స్తుతిని క్రమం తప్పకుండా వినే వ్యక్తులు మానసికంగా ఎంత దృఢంగా, ప్రశాంతంగా ఉంటారో అనేక శాస్త్రీయ అధ్యాయాలు నిరూపించాయి. నిద్రలేమి (ఇన్సోమ్నియా), తీవ్రమైన ఆందోళన (యాంగ్జైటీ), డిప్రెషన్ వంటి ఆధునిక మానసిక రుగ్మతలు ఈ నాద చికిత్స ద్వారా క్రమంగా నయమవుతాయని మానసిక నిపుణులు సైతం అంగీకరిస్తున్నారు. కాబట్టి ఇది కేవలం అంధవిశ్వాసం కాదు ఇది పక్కా మనోవిజ్ఞాన శాస్త్రం (సైకాలజీ) ఆమోదించిన నిఖార్సైన వాస్తవం. సాధారణ సంగీతానికే మానసిక గాయాలను మాన్పే హీలింగ్ పవర్ ఉంటే, ఇక దైవభక్తితో కూడిన పవిత్ర సంగీతానికి ఆ శక్తి రెట్టింపు కావడం సహజం కదా!జీవిత యుద్ధంలో అపజయాలు ఎదురైనప్పుడు ఆధ్యాత్మికతే మనకు పరమ ఔషధంగా మారుతుంది. అలసిపోయిన శరీరానికి విశ్రాంతి దొరుకుతుందేమో కానీ, విరిగిపోయిన మనసుకు మాత్రం ఆ శంకర నాదమే సంజీవని అవుతుంది. బాహ్యంగా అన్నీ కోల్పోయినా మన అంతరంగంలో మిగిలే ఆ దివ్య నాదం మనల్ని మళ్లీ నవనటరాజుల్లా నిలబెడుతుంది. శంకరుని నాదశరీర తత్వం అనేది కేవలం ఒక స్తుతి కాదు, అది మనల్ని చీకటి నుంచి వెలుగు వైపు, వైఫల్యాల నుంచి విజయాల వైపు నడిపించే ఒక దివ్యమైన ఆధ్యాత్మిక కంపాస్ (దిక్సూచి). దాన్ని నమ్ముకుంటే జీవితంలో పరాజయం అనే మాటకే తావుండదు!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

### భావితరాలకు భద్రపరచిన అమూల్య వారసత్వ సంపద

### అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి

హైదరాబాద్: మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావని, అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్ లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు లేని కాలంలో అద్భుతమైన కట్టడాలను మన పూర్వీకులు నిర్మించారని, వాటిని చూసి తరించక పోతే జీవితం సంపూర్ణం కాదని తెలిపారు. ÷ూమప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్ లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు.

# అర్హులైన పద్మశాలి చేనేత కార్మికులకి జియో ట్యాగ్ నంబర్ కేటాయించాలి

## పద్మశాలి సంఘం మండల అధ్యక్షకార్యదర్శులు ఎలగందుల మహేష్ గాడిపల్లీ ఉదయ్ కుమార్

**ఆత్మకూరు(ఎం),మే18/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలోని అర్హులైన ప్రతి ఒక్క పద్మశాలి చేనేత కార్మికులకు జియో ట్యాగ్ నెంబర్ మరియు మోత్కూర్ చేనేత సహకార సంఘంలో సభ్యత్వం కల్పించాలని కోరుతూ సోమవారం రోజు మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు ఎలగందుల మహేష్ మరియు ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ జియో టాగ్ నెంబర్ మరియు చేనేత సహకార సంఘంలో సభ్యత్వం లేకపోవడం వలన చాలామంది నిరుపేద చేనేత కార్మికులు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని తెలిపారు. మోత్కూర్ చేనేత సహకార సంఘంలో నూతన సభ్యత్వాలు ఇవ్వకుండా కొంతమంది అడ్డుకుంటున్నారని వారిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు రేగోటి పాండురంగం తదితరులు పాల్గొన్నారు.



# యాదగిరిగుట్ట నుండి ఆలేరు వరకు సైకిల్ పై ప్రయాణించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ఆత్మకూరు(ఎం),మే18/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సోమవారం రోజు ఉదయం 6 గంటలకు యాదగిరిగుట్ట మండల కేంద్రం నుండి ఆలేరు నియోజకవర్గ కేంద్రం వరకు సైకిల్‌పై ప్రయాణించినారు. పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో పేద మరియు సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతోందని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో సామాన్య ప్రజలు మళ్లీ సైకిళ్లపై ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. అనంతరం వంగపల్లి మీదుగా ప్రయాణిస్తూ అక్కడి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వడ్ల కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యం కొనుగోలు పారదర్శకంగా మరియు వేగవంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు పండించిన ప్రతి గింజకు సరైన ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, కొనుగోలు కేంద్రాల్లో లారీలు, తూకం, హమాలీలు వంటి సౌకర్యాలు సమయానికి అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.




# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

## ఎమ్మెల్యే మందుల సామెల్

**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామిల్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేందుకు లారీల సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది. ఏ ఒక్క రైతు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని. చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్పర్సన్ జయసుధ సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి,కట్ట మల్లారెడ్డి,నకెరకంటి వెంకన్న,పసుల అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం


తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595


# పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆంజనేయులు



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, సి ఎన్ జీ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. ఆంజనేయులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, చౌరస్తా వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారాన్ని మోపిందని విమర్శించారు. ఒకవైపు ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని సూచిస్తూనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలు, పెద్ద పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు అమలు చేస్తూ దేశ ప్రజలను అప్పుల్లోకి నెట్టుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, కార్మికులు, కూలీలు, ఉద్యోగులకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొస్తూ యజమానులకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను విరమించి పెంచిన ఇంధన ధరలను తగ్గించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఏపీ మల్లయ్య, పి. పరశురాములు, ఎంప్లాయిస్ పత్రిక ఎడిటర్ కే. వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు శివరాములు, చెన్నయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సివిల్ సప్లై గోదాం అమాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలయ్య, యాదయ్య, నరేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# రాజిరెడ్డి కుటుంబానికి కెహెచ్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**ఆత్మకూరు(ఎం),మే18/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన నాయిని రాజిరెడ్డి ఆదివారం రాత్రి ఆకస్మికంగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కెహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్రమంలోనే బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ ఫౌండేషన్ తరఫున రూ. 10,000 (పది వేలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాయిని నర్సింహారెడ్డి,సురేందర్, నాగయ్య, నర్సిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొని రాజిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు.

# జడల యషిల్ గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన్ విద్యార్థికి 1లక్ష రూపాయలు నగదు ఆర్థిక సహాయం



**ఆత్మకూరు(ఎం),మే 18/క్రైమ్ మిర్రర్:** ఇటీవల విడుదల అయిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా టాప్ ర్యాంకు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని విజ్ఞాన్ హై స్కూల్ విద్యార్థి సారా సాయి మాధవ్ 581/600 సాధించారు. వారి ఉన్నత చదువుల కొరకు యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన జడల యషిల్ గౌడ్ (జె వై జి )ఫౌండేషన్ చైర్మన్ జడల యషిల్ గౌడ్ ఇంటర్మీడియట్ చదువుకై పూర్తి బాధ్యత తీసుకున్నట్లు మరియు ముందస్తుగా నగదు 1లక్ష రూ ఆర్థిక సహాయం జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్ చేతుల మీదుగా వారి తండ్రి సారా మల్లేశం గౌడ్ కి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి భవిష్యత్తు చదువులకై పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని భవిష్యత్తులో మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారి తండ్రి సార మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ నా కుమారుడి చదువుకై ఆర్థిక సహాయం అందజేస్తున్న జడల యషిల్ గౌడ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ డా. పగిడాల జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గడసంతల సాహిత్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్

**ఆత్మకూరు(ఎం),మే18/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామ నివాసి రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎంబిబిఎస్ విద్యార్థి డాక్టర్ గడసంతల సాహిత్ కుటుంబాన్ని తండ్రి గడసంతల మధు(పిఇటీ)ని పుత్రశోకంతో ఉన్న వారిని మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట బిఆర్ఎస్ నాయకులు పుట్ట మల్లేష్,పంతం కృష్ణ, వార్డు సభ్యులు కర్రే చంద్రశేఖర్, మాజీ యూత్ అధ్యక్షులు దుద్దురు శ్రీశైలం గౌడ్, బిఆర్ఎస్వి మాజీ మండల ఉపాధ్యక్షులు మోటే శేఖర్, పల్లపు రాజకుమార్, కర్రె చింటూ, గడసంతల చంద్రమౌళి, భాస్కర్ , గడసంతల ఆంజనేయులు , రామకృష్ణ, పుర్మ సంపత్, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.



# కేంద్ర ప్రభుత్వం పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలి

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుపై సిపిఐ నిరసన

**క్రైమ్ మిర్రర్ ,హుజూర్ నగర్ (గరిడేపల్లి) :** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలకు నిరసనగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గ్యాస్ బండలతో నిరసన వ్యక్తం చేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రం లో అధికారం లో వున్న బిజెపి ప్రభుత్వం, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు కూడా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను నమ్మించబోమే పెంచ భూమిని ప్రజలను నిర్మించి ఓట్లు వేయించుకొని ఎన్నికలు గెలిచిన తర్వాత తపాల వారీగా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచుతూ ప్రజలను నమ్మకంలో మోసం చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం వెంటనే పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలను పెంచి పేద ప్రజల పైన భారం మోపిందనిఆయన అన్నారు. భారతదేశం వెలిగిపోతుంది పేదరికం లేని దేశంగా మారుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల సందర్భంగా ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాట్లాడిన మాటలు అన్నీ నీటి బుడగల లాగా అయ్యాయని ఆయన అన్నారు. పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు పెంచి



పేదవారి నడ్డి విరచడమేనా మీరు చెప్పే మాటలకు అర్థం అని ఆయన అన్నారు. నిత్యావసర ధరలు పెరిగి ప్రజలుఆర్థికంగా సతమతమవుతున్నటువంటిఈ పరిస్థితులలో వంటగ్యాసు ధర పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి ప్రజలను ఇంకొంచెం ఆర్థికంగా అణిచివేతకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన వంటగ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు త్రిపురం సుధాకర్ రెడ్డి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు యడ్ల అంజిరెడ్డి,కుందూరు వెంకటరెడ్డి, షైక్ నబిసాహెబ్, ఈద చిన్న భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాస్క్ వేసుకుని మాయమైపోయాడు.. చివరకు చిక్కేశాడు..!

## సీసీ ఫుటేజ్‌తో చైన్‌స్నాచర్ అరెస్ట్

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మే 18: మాస్క్ ధరించి మహిళల మెడల్లోని బంగారు గొలుసులను లాక్కొని మాయమవుతున్న చైన్‌స్నాచర్‌ను మిర్యాలగూడ పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో అరెస్ట్ చేశారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా గాలింపు చేపట్టిన పోలీసులు, మరోసారి స్నాచింగ్‌కు యత్నిస్తున్న సమయంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కె. రాజశేఖర్‌రాజు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని మందుల కాలనీలోని వైష్ణవి హోమ్స్ సమీపంలో ఈ నెల 11వ తేదీ రాత్రి ఇద్దరు మహిళలు వాకింగ్ చేస్తుండగా, మాస్క్ ధరించిన వ్యక్తి యమహా బైక్‌పై వచ్చి వారి మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పరారైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలతో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తూ నిందితుడి కదలికలను గుర్తించిన పోలీసులు, పట్టణంలోని హనుమాన్‌పేట్ ఫ్లైఓవర్ వద్ద మరోసారి చైన్‌స్నాచింగ్‌కు యత్నిస్తున్న సమయంలో అతడిని పట్టుకున్నారు. అరెస్టైన నిందితుడు ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండలం మునివేముల గ్రామానికి చెందిన గొట్టిముక్కాల నాగ చిన్న వెంకటేశ్వర్లు అలియాస్ గిరిగా



గుర్తించారు. బెట్టింగ్‌లకు బానిసై రూ. 1.20 లక్షల అప్పులు చేయడంతో వాటిని తీర్చేందుకు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైందని డీఎస్పీ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 24 గ్రాముల బంగారు పుస్తెల తాడు, యమహా బైక్, స్మార్ట్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న ఒన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగభూషణరావు, హెడ్ కానిస్టేబుల్ రాజారాం, కానిస్టేబుళ్లు నల్లగంతుల శ్రీను, గద్దల హుస్సేన్, బి. వీరబాబు, జి. నర్సింహా, బి. ప్రసాద్, జి. రాజశేఖర్‌రెడ్డిలను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

## టీజీఆర్‌జేసీ ఫలితాల్లో మెరిసిన గుండమల్ల అక్షిత

### రాష్ట్ర స్థాయిలో 214వ ర్యాంకు సాధించిన సంస్థాన్ నారాయణపురం విద్యార్థిని

**సంస్థాన్ నారాయణపురం, మే 18(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని గుండమల్ల అక్షిత టీజీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ విద్య కోసం గురుకుల కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించిన ఈ పరీక్షలో అక్షిత 214వ ర్యాంకు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చింది. అక్షిత సాధించిన ఈ విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో చదివి ఈ ఘనత సాధించిన అక్షితను ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## సమగ్ర ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం

### రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి
### గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త డా.పి.అక్షిత్ సాయి



**క్రైమ్ మిర్రర్, పాలకీడు :** రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయం వైపు మారడం ద్వారా రైతులు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చు. అంతేకాకుండా, భూసారాన్ని, మానవ ఆరోగ్యాన్ని రక్షించుకోవడంతో పాటు నాణ్యమైన, విషరహిత దిగుబడులను సాధించి మంచి లాభాలను పొందవచ్చు అని కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్త డా. పి . అక్షిత్ సాయి అన్నారు. పాలకీడు మండలం గుడుగుండ్ల పాలెం గ్రామం లో సమగ్ర ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు భూసార పరీక్ష ప్రాముఖ్యతను, మరియు ఇటీవలే భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు చేసిన విజ్ఞప్తులలో ముఖ్యమైన రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం అవలంబించడం పైన రైతులకు వివరించారు. ముఖ్యంగా భూసార పరీక్ష కోసం మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని తెలిపారు. రైతులు తమ భూముల ఉత్పాదకతను పెంచుకోవాలంటే మట్టి పరీక్ష ఆధారంగా ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే సమగ్ర ఎరువుల వినియోగంలో భాగంగా పచ్చి రొట్ట ఎరువులు వాడకం వల్ల కలిగే లాభాలను వివరించారు. పచ్చి రొట్ట ఎరువుల వలన భూమి సారవంతం పెరగడం, నేల నిర్మాణం మెరుగుపడడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గడం వంటి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ సమతుల్య ఎరువుల వాడకం మరియు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాఘవను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్

**ఆత్మకూరు(ఎం),మే18/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రానికి చెందిన పులిపలుపుల మహేష్ కుమారుడు రాఘవ ఇటీవల ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా బంజారాహిల్స్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సందర్భంగా రాఘవను పరామర్శించిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. విరివెంట పుట్ట మల్లేష్ గౌడ్,పంతం కృష్ణ, జింకల రామకృష్ణ, కూతటి అంజన్, జింకల భరత్ ఉన్నారు.

## సిలార్ పల్లి లో సీసీ రోడ్ పనులు ప్రారంభం




**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** కల్వకుర్తి మున్సిపాలిటీలోని 6వ వార్డు సిలార్ పల్లిలో సోమవారం కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మాజీ కౌన్సిలర్ చిగుల్లపల్లి సతీష్ తో కలిసి పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైనా సీసీ రోడ్ పనులను ప్రారంభించారు. సిలార్ పల్లి అభివృద్ధి కి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పుట్ట రేణుక రాజశేఖర్, నాయకులు శ్యాం సుంధర్ రెడ్డి, గుర్రాల జంగారెడ్డి, పాండు రంగా రెడ్డి, పుట్ట వెంకటయ్య, పెద్ద రాంరెడ్డి, బీమయ్య, జంగయ్య, దున్న భాస్కర్ తదితరులు ఉన్నారు.

## యోగతో శారీరక, మానసిక ఆరోగ్యం




**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** ప్రతిరోజూ యోగ చేయడం వల్ల శరీరానికి చురుకుదనం, మనసుకు ప్రశాంతత లభిస్తాయని ఎంపీడీవో సునీత తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మండల కేంద్రంలో ఫిట్ యాక్టివ్ తెలంగాణ మార్తాన్ శారీరక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత మాట్లాడుతూ యోగతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. యోగ ద్వారా ఒత్తిడి తగ్గి, రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే రక్తప్రసరణ సక్రమంగా జరిగి, నిద్ర సమస్యలు తగ్గుతాయి. ప్రాణాయామం, ధ్యానం వంటి యోగాసనాలు శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా యోగ సాధన చేయాలని కోరారు. ఈనాటి కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్పర్సన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, నూతనకల్ సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, ఉప సర్పంచ్ నాగం సరిత సుధీర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి,ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రంగారెడ్డి జిల్లా, మండలవారీగా, షాద్నగర్, కేశంపేట, కడ్తాల్, కందుకూరు, కొత్తూరు, తలకొండపల్లి అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈక్రింది నెంబరుకు సంప్రదించగలరు.
Email ID: crimemirrorts@gmail.com
9393 44 6188

# పరుగులో పాల్గొని యువతను ఉత్సాహపరిచిన ఎమ్మెల్యే





**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మే 18:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం క్రీడా, యువజన వారోత్సవాలు ఉత్సాహంగా నిర్వహించారు. యువత, క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి క్రీడాపోటీలు, 5కే రన్, వాక్థాన్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, యువతతో కలిసి ఆయన స్వయంగా పరుగులో పాల్గొని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు."ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" ద్వారా పాలనను ప్రజల వద్దకే తీసుకువెళ్తున్నామని, యువత సమాజ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి. శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలకృష్ణ, కౌన్సిలర్లు దేశిడి శేఖర్‌రెడ్డి, బూడిద సైదులు, షేక్ అబ్దుల్లా, పీడీ కె. వెంకటేశ్వర్లుయాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, యువజన సంఘాల నాయకులు, క్రీడాకారులు, కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



## క్రీడలతోనే... క్రీడా స్ఫూర్తి దేశభక్తి భావం పెంపు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** క్రీడలతోనే క్రీడా స్ఫూర్తి, దేశభక్తి భావం, యువశక్తి వికాసం పెంపొందుతాయని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి తుంబూరు సునీల్ రెడ్డి అన్నారు. సోమవారం "ప్రజా పాలన - 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక"లో భాగంగా యువజన క్రీడా వారోత్సవాలను ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రారంభించారు. 5కే రన్‌కు జెండా ఊపి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. యువతలో శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, క్రమ శిక్షణ, చైతన్యం, ఆరోగ్యంపై అవగాహన పెంపొందిం చడమే ఈ వారోత్సవాల లక్ష్యమని తెలిపారు. క్రీడలు ఉపాధి అవకాశాలకు కూడా దోహదపడతాయన్నారు.

**రేపటి కార్యక్రమం:** 19-05-2026 (మంగళవారం) ఉదయం 10:30 గంటలకు సర్దార్ పటేల్ స్టేడియం, ఖమ్మంలో "కెరీర్ ఒ స్కిల్ డెవలప్‌మెంట్ - ఎంపవర్ స్కిల్, స్కిల్ ఎంపవర్ ఫ్యూచర్" అనే అంశంపై కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమం యూట్యూబ్ లైవ్ ద్వారా http://youtube.com/live/ RSjzwuLO_XE లో ప్రసారం అవుతుంది. క్రీడాకారులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని డీవైఎస్‌వో పిలుపునిచ్చారు.

**మొదటి రోజు కార్యక్రమాలు:** వారోత్సవాల్లో భాగంగా మొదటిరోజు "ఫిట్ ఒ యాక్టివ్ తెలంగాణ" కార్యక్రమం కింద యోగా, ఏరోబిక్స్, మెడిటేషన్, 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, వాకర్స్, విద్యార్థులు, వైద్య అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఉదయ్ కుమార్, నాగమణి, కోచ్‌లు గౌస్, ఎస్.ఎస్.ఎస్. మూర్తి, చారి, చంద్రకాంత్, కైలాష్, కొండల్, మోహన్, నాగరాజు, సురేష్, హరీష్, నోయల్ జాక్సన్, సీనియర్ బ్యాడ్మింటన్ ప్లేయర్లు, మారథాన్ ప్లేయర్లు, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు

### అలపాడ్ గ్రామ రజకులకు ఎస్సీ రిజర్వేషన్‌పై

## అవగాహన కల్పిస్తున్న గోపి రజక

### తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి

**సంక్షేమ పథకాలు లేక రజకుల బ్రతుకులు ప్రశ్నార్థకం? ఇటిక్యాల బండలయ్య**



**గద్వాల్, మే 18(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రజకులకు ఎస్సీ రిజర్వేషన్ అంశంపై అవగాహన కల్పిస్తు ముందుకు సాగుతున్న తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక అందులో భాగంగా గద్వాల్ జిల్లా ధరూర్ మండలం అలపాడ్ గ్రామంలో గ్రామ అధ్యక్షులు చాకలి కొత్తింటి గోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, దౌదరపల్లి నర్సిములు ,ఇటిక్యాల బండలయ్య,పేపర్ నర్సిములు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఒకే కులవృత్తి చేస్తున్న ఏకైక సేవా కులం రజకులని కానీ భిన్న రిజర్వేషన్లు ఉండటం ఆర్థిక, రాజకీయ సామాజిక అసమానతలకు గురైతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు లేక రజకుల బ్రతుకులు ప్రశ్నార్థకం? ఇటిక్యాల బండలయ్య నీళ్ళు నిధులు నియామకాల కోసం ప్రత్యేక తెలంగాణ ఏర్పడి 12 సం.లు గడిచిన గత ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ పథకాలకు అందుకనే కాంగ్రెస్ ప్రభుత్వమైనా రజకుల సంక్షేమం కోసం పాటుపడుతుందని ఆశతో గ్రామాల్లో నేటికీ ఎదురు చూస్తున్నారని వాళ్ళ ఎదురుచూపులు అడియాశలు కాకుండా చూసే బాధ్యత ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి పై ఉందని ఇటిక్యాల బండలయ్య అన్నారు. ఎలాంటి షరతులు లేని ఋణాలు బ్యాంకుల ద్వారా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

**2016 హామీని సీఎం నెరవేర్చాలన్న దౌదరపల్లి నర్సిములు**

కోడంగల్ నియోజకవర్గం టీడిపి ఎమ్మెల్యేగా 2016 లో రజకుల సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయించాలని ,రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో మాట్లాడిన ఏనుముల రేవంత్ రెడ్డి నేడు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వారు సాకారం చేసేందుకు కృషి చేయాలని దౌదరపల్లి నర్సిములు కోరారు.

**గ్రామ సమావేశంలో పాల్గొన్న సభ్యులు**

ధరూర్ మండల ఉపాధ్యక్షులు సికె కిష్టన్న,గ్రామ కార్యదర్శి సి.పెద్ద నర్సిములు, కోశాధికారి మల్లేష్, ఉపాధ్యక్షురాలు పద్మమ్మ, మెంబర్ ఇస్త్రీ శ్రీనివాసులు, మెకానిక్ నర్సిములు,జమ్మన్న, పరమేశ్,గోవింద్ ,ఆటో కృష్ణ,ఇస్త్రీ నర్సిములు తదితరులు పాల్గొన్నారు

## పెట్రోల్ , డీజిల్ ధరను వెంటనే తగ్గించాలి : దబ్బటి శేఖర్



**యాదాద్రి భువనగిరి, మే 18(క్రైమ్ మిర్రర్):** సమాచార హక్కు రక్షణ చట్టం -2005 యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు దబ్బటి శేఖర్ పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ , డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని ఇప్పటికే వంట గ్యాస్ సరఫరా లేక పేద ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు కావున ఇలాంటివి కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలను అర్థం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి పత్రిక ప్రకటనలో దబ్బటి శేఖర్ తెలియజేశారు.

## నేడు మునుగోడులో ప్రభుత్వ స్కీమ్స్ పై అవగాన

మునుగోడు క్రైమ్ మిర్రర్: మునుగోడు గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం రోజు గవర్నమెంట్ స్కీమ్స్, లేబర్ కార్డు, అభ కార్డు గురించి చెప్పడానికి, లేబర్ ఆఫీసర్ , తపాలా శాఖ అధికారులు రావడం జరుగుతుందని సెక్రెటరీ రాజశేఖర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామ ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని,.ప్రతి ఒక్కరు ఆధార్ కార్డు తీసుకొని రావాలని తెలిపారు.

## మహిళలు కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి

### యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి జిల్లా, మే 18, క్రైమ్ మిర్రర్ :** మహిళలు కొత్త ఆలోచనలతో ఆర్థికంగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో యాదాద్రి ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్ మహిళలు తయారు చేసిన మునుగ టీ ని ఘనంగా వారి చేతుల మీదుగా ప్రారంభించారు.మహిళలు తయారు చేసిన టీ ఉత్పత్తుల గురించి తెలుసుకొని ఇలాంటి కొత్త తరహా ఆలోచలనతో ముందుకి సాగుతూ వారి జీవన ప్రమాణాలని మెరుగుపర్చుకోవాలని,దానికి ప్రభుత్వం తరుపున సహకారం కూడా ఇస్తామని కలెక్టర్ అన్నారు . ఇట్టికార్యక్రమంలో కలెక్టర్ అనురాగ్ జయంతి , అదనపు కలెక్టర్ వెంకారెడ్డి , అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , నాగిరెడ్డి , రమణా రెడ్డి , మాధవి , జిల్లా అధికారులు పత్రిక విలేకరులు ప్రాసెసింగ్ యూనిట్ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

## సంఘం బలోపేతం, కురుమ సమాజ అభివృద్ధికి కృషి చేయాలి

### హెచ్‌పికేఎస్ జంట నగరాల అధ్యక్షులు ఎస్.వెంకటేష్



**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం 15/1951 ఎన్నికల సందర్భంగా ఫ్యానల్--2 తరపున తెలంగాణ రాష్ట్ర కురుమ యువత ఉపాధ్యక్షుడిగా ఎన్.రమేష్ కురుమ నియమితులైయ్యారు. ఈ సందర్భంగా ఫ్యానెల్--2 కురుమ సంఘం నాయకులు సోమవారం హెచ్‌పికేఎస్ జంట నగరాల అధ్యక్షులు ఎస్.వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నూతనంగా ఎన్నికైన సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ దాదాపుగా బాబుల్‌రెడ్డినగర్‌లో 40 సంవత్సరాలకు పైగా ఉమ్మడి పాలమూరు జిల్లా కురుమలు నివసిస్తున్న తెలంగాణ రాష్ట్ర సంఘం నాయకులు గుర్తించకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఇప్పుడు మమ్మల్ని తెలంగాణ రాష్ట్ర సంఘం ప్యానెల్--2 గుర్తిదంచి మా యువకులకు సంఘంలో ప్రత్యేక గుర్తింపునీ ఇచ్చి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నందేవల్లి రమేష్‌ను, అలాగే జంట నగరాల ఉపాధ్యక్షులుగా పూజారి ప్రవీణ్, సన్నీలకు ఇవ్వడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో కురుమ కులంపై శ్రద్ధ చూపుతున్న దొడ్డి శ్రీనాథ్‌కి రాబోయే రోజుల్లో యావత్ తెలంగాణ కురుమ కులస్తులు తమ వెన్నంటి ఉండేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు యావత్ తెలంగాణ కురుమలు శ్రీనాథ్‌కి అండగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.అశోక్‌కుమార్, అడికె సంతోష్, శేఖర్, శంకర్ తదితరులున్నారు.

## ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకం.. కాంగ్రెస్ తోనే సాధ్యం



**కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ**

**ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా**

**చౌటుప్పల్,మే 18, క్రైమ్ మిర్రర్ :** ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామానికి చెందిన పిసాటి అనూష, ఊదరి మధురిమ లకు మంజూరైన రూ.1,00,116 ల విలువైన కళ్యాణ లక్ష్మి చెక్కులను సర్పంచ్ జువ్వి నర్సింహ్మా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు, 200యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు అమలు చేసిందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు రాచకొండ భార్గవ్, ఐతరాజు శారదలింగస్వామి, మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు ఊదరి రవి, వల్లభోతు నరేష్ లబ్ధిదారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## జాగ్రత్తగా ప్రయాణించండి ...సురక్షితంగా ఇల్లు చేరండి

### మునుగోడులో రహదారి భద్రతపై అవగాహన సదస్సు




**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి మునుగోడు మండల కేంద్రంలోని సత్య ఫంక్షన్ హాల్ లో పోలీస్ శాఖ మునుగోడు ఆధ్వర్యములో ప్రజలకు కళా జాత ఆధ్వర్యములో అవగాహన కల్పించారు.. ఏఎస్సై వెంకన్న పలు నిబంధనలు పాటించాలని సూచించారు.మితిమీరిన వేగం మందు సేవించి డ్రైవింగ్ చేస్తూ హెల్మెట్ పెట్టుకోకుండా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని,ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి జాగ్రతగా ప్రయాణించాలని సూచించారు..పాలకూరి నరసింహ గౌడ్,గజ్జల బాలరాజు గౌడ్, తీర్పాటి ఆంజనేయులు,,వివిధ గ్రామాల ప్రజలు,పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మణికొండలో మౌలిక వసతుల సమస్యలపై సీఎంసీ జోనల్ కమిషనర్‌ను కలిసిన ఫెడరేషన్ ప్రతినిధులు




**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకువెళ్లి పరిష్కార మార్గాలు చూపిస్తున్నామని మణికొండ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ ఆర్‌డబ్ల్యూఏఎస్ అధ్యక్షుడు ఆర్వపల్లి వంశీ అన్నారు. సోమవారం సీఎంసీ జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణికొండ వ్యాప్తంగా ఇంకా వేయని రహదారులను పూర్తి చేయాలని, దెబ్బతిన్న రోడ్లపై క్రమం తప్పకుండా గుంతల మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. అలాగే ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు, కనెక్టివిటీ మెరుగు పర్చేందుకు అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెంబర్ 13 నుంచి బీఆర్‌సీ రోడ్ వరకు, అల్కాపూర్ టౌన్‌షిప్ 100 ఫీట్ల రోడ్ నుంచి నార్సింగి రోడ్ వరు కీలక కనెక్టివిటీ రోడ్లను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇంకా చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న మర్రిచెట్టు నుంచి ట్రైల్స్? విల్లాస్ రోడ్, ఆంధ్రాబ్యాంక్ పైపులైన్ రోడ్ నుంచి షేక్‌పేట్ వరకు మంజూరైన రహదారుల పనులను పునప్రారంభించి వేగవంతం చేయాలని కోరారు. మణికొండ పరిధిలో పందెం వాగు నుంచి తారామతి బారాదరి వరకు నాలాల శుభ్రపరిచే పనులు, డీసిల్టింగ్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న డైనేజీ, కల్వర్టు పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రా ఆధ్వర్యంలో రక్షించబడిన తిరుమల హిల్స్? పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అదే విధంగా పలుచోట్ల ఎదురవుతున్న ప్రాపర్టీ ట్యాక్స్? వ్యత్యాసాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ మణికొండ రోడ్ల గుంతల మరమ్మత్తులకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. అత్యవసర మరమ్మత్తులు అవసరమైన రహదారుల వివరాలను అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు ప్రవీణ, జాయింట్ సెక్రటరీలు శంకర్ దేవ్, కృష్ణకుమార్, ఈసీ సభ్యులు డాక్టర్ పి.అవినాష్, డి.శ్రీనివాస్రెడ్డి, రామయ్య, ఎరన్న, ఎస్వీఎస్ఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



## విద్యానగర్ రోడ్డు సమస్యపై ఎమ్మార్వోకు విన్నవించిన కాంగ్రెస్ నాయకులు

**గండిపేట(క్రైం మిర్రర్):** విద్యానగర్ రోడ్డు సమస్యకు పరిష్కారం లభించిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి సూచించారు. విద్యానగర్ రోడ్డు సమస్య గురించి సోమవారం ఎమ్మార్వోని కలిసి సమస్యను వివరించామన్నారు. వాహనాదారులు, పాదాచారులు పడుతున్న ఇబ్బందులకు ఆయన దృష్టికి తేవడంతో సానుకూలంగా స్పందించి రోడ్డు చేసుకోవాలని సూచించారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, డప్పు నవీన్‌కుమార్, శ్రీనివాస్, డైరెక్టర్ బాలరాజ్, అంకం శ్రీనివాస్, విద్యానగర్ ఫేస్ టూ కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## శంషాబాద్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అమరలింగం



**గండిపేట(క్రైం మిర్రర్):** శంషాబాద్ తహసీల్దార్‌గా సోమవారం అమరలింగం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన అధికారి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో అమరలింగం వచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన తన చాంబర్‌లో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను కలిసి అభినందించి సన్మానించారు.

## వడ్లు కొనుగోలు చేయాలని మర్రిగూడ చౌరస్తాలో రైతుల ధర్నా

### తహసీల్దార్ జక్కర్తి హామీతో విరమణ



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** వడ్ల కొనుగోలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ, మర్రిగూడ మండల కేంద్రంలోని వట్టిపల్లి చౌరస్తాలో, శనివారం ఉదయం రైతులు మెరుపు ధర్నాకు దిగారు. సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించడంతో, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ధర్నాలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ.. రబీలో పండించిన వడ్లు నెలల తరబడి, కల్లాల్లోనే ఉన్నాయని అకాల వర్షాలు పడితే ధాన్యం మొత్తం తడిసిపోయి, తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెప్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం కొనుగోళ్లు జరగడం లేదని, తేమ, తాలు పేరుతో సాకులు వెతుకుతూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని వారు తీవ్రంగా విమర్శించారు. ధర్నా చేస్తున్న రైతులకు పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో, చౌరస్తాలో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న మర్రిగూడ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం మర్రిగూడ ఎమ్మార్వో జక్కర్తి శ్రీనివాస్ అక్కడికి చేరుకొని, రైతులతో మాట్లాడి వారి సమస్యలను విన్నారు. వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తామని, రెండు రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యేలా, చర్యలు తీసుకుని రైతు నష్టపోకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మార్వో ఇచ్చిన అధికారిక హామీతో రైతులు శాంతించి తమ ధర్నాను విరమించారు.

## వినతి పత్రం అందజేత

మునుగోడు క్రైమ్ మిర్రర్: ఆశా వర్కర్స్ యూనియన్ , సీఐ టి యు ఆధ్వర్యములో సోమవారం రోజు ఆశావర్కర్ల వివిధ డిమాండ్లతో మునుగోడు మండల కేంద్రంలోని ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పి ఆర్ ఓ హరిప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు.. ఆశావర్కర్లు,నాయకులు పాల్గొన్నారు.



# భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం

## కాటేదాన్ నుంచి వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక





**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం వ్యక్తమైంది. కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొంపల్లి జగదీష్ నేత కషితో కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్‌పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డిలు పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ కేసీఆర్ చేసిన అద్భుతమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి నిరంతర శ్రమను చూసి నేడు ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఇతర పార్టీలలో కార్యకర్తలకు ప్రజా సమస్యలకు విలువ లేకపోవడంతో అక్కడి విధానాలపై విసిగిపోయి ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ పార్టీని ఎంచుకున్నారన్నారు. కాటేదాన్ డివిజన్ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు పార్టీ నమ్మి వచ్చిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, సబితాఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డిల నాయకత్వంలో కాటేదాన్ డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముమ్ముందుకు తీసుకెళ్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నోములరాముయాదవ్, కొంపల్లిజగదీష్ నేత, మైసిరెడ్డి, సంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, అనిల్, సంతోష్, చిన్న ప్రదీప్, అశోక్‌కుమార్, కార్తీక్‌ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులు యూరియా వినియోగం తగ్గించాలి

### శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతులను పాటించి, ఆర్థికంగా ఎదగాలి

### డాక్టర్ స్వర్ణలత దేవి మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు





**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** రైతులు యూరియా వినియోగం తగ్గించి, సాగు ఖర్చులు తగ్గించాలని డాక్టర్ స్వర్ణలత దేవి మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు అన్నారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ముజాహిద్పూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్ర నగర్ వ్యవసాయ పరిశోధన ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు- అనే కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి వీరస్వామి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పరిశోధనా కేంద్రం రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ రైతులు అధికంగా యూరియా వాడకాన్ని తగ్గించాలని యూరియా అధిక వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతిని దీర్ఘకాలిక ఉత్పాదకత తగ్గుతుందని తెలిపారు. యూరియా వినియోగం తగ్గించడం ద్వారా సాగు ఖర్చులు కూడా తగ్గుతాయని వివరించారు. అలాగే రైతులు రసాయనాల వినియోగాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడాలన్నారు. అధిక రసాయనాల వాడకం వల్ల పర్యావరణం, నేలతల్లి ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. పురుగుల మందుల ప్రభావం వల్ల రైతులకు మేలు చేసే వానపాములు, మిత్ర పురుగులు కూడా నశిస్తున్నాయని తెలిపారు. మార్కెట్ లో గిరాకి ఉన్న వరి రకాలు సాగు చేసి అధిక ఆదాయం పొందాలని రైతులకు సూచించారు. పంటలను కాపాడటానికి వేపనూనె స్ప్రే, దశపర్ణి కషాయం, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి సహజ పద్ధతులను వినియోగించి రసాయన రహిత పంటలను పండించాలని అన్నారు. శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతులను పాటించి రైతులు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ అనూష మాట్లాడుతూ పురుగుమందులు విచ్చలవిడిగా పిచికారి చేయకుండా పురుగు శాతం గమనించి వాడాలి అని సూచించారు. మండల వ్యవసాయ అధికారి వీరా స్వామి మాట్లాడుతూ విత్తనాలు అధీకృత డీలర్ల వద్ద మాత్రమే కొని, బిల్లు తీసుకొని, బిల్లును పంట ముగిసే వరకు దాచిపెట్టుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు చెప్పిన విషయాలు ఆచరించి అధిక దిగుబడులు సాధించాలని, విత్తనాలు కొనేముందు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చంద్ర భూపాల్, పీరంపల్లి సర్పంచ్ వెంకటయ్య, రాంరెడ్డిపల్లి సర్పంచ్ నర్సింలు, వ్యవసాయ విస్తరణ అధికారి సాయితేజ, పంచాయతీ సెక్రటరీ సంతోష్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మూసాపేట్ సర్కిల్ నూతన డీసీ తిరుపతికి ఘన స్వాగతం

### శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కర్క నాగరాజు

**బాలానగర్, మే 18 (క్రైమ్ మిర్రర్) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసాపేట్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తిరుపతి ని కూకట్‌పల్లి నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కర్క నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా కర్క నాగరాజు తిరుపతిని శాలువాతో సత్కరించి, పూల బొకేతో శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కర్క నాగరాజు మాట్లాడుతూ మూసాపేట్ సర్కిల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను డీసీ తిరుపతి పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరిస్తారని పూర్తి నమ్మకం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చురుకుగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సర్కిల్ అభివృద్ధి, కార్మికుల సమస్యలు, స్థానిక ప్రజల అవసరాల పై కూడా చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీ కంటైనర్స్ యూనియన్ నాయకులు జగన్, పాషా, లోహిత్ రాజ్ తదితరులు పాల్గొని నూతన డీసీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కొత్త డీసీ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్ష స్థానిక ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, పరిపాలనను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 19-5-2026


# కూకట్ పల్లి నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి

## కలెక్టర్ కార్యాలయంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు






**కూకట్ పల్లి, మే 18 (క్రైమ్ మిర్రర్) :** మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆఫీసులో సోమవారం జరిగిన జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులతో సహా మేడ్చల్ జిల్లా ఎమ్మెల్యేలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కేపీహెచ్బీ లోని ఎన్టీఆర్ స్కూలుకు సంబంధించి ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభించామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు ఆగడంపై ఆ విషయమై ఎన్నోసార్లు కలెక్టర్ కు నివేదించామని, ఆ స్థలాన్ని జిహెచ్ఎంసికి కేటాయించి.. స్కూల్ నిర్మాణం పూర్తి చేసే విధంగా అధికారులకు సూచనలు ఇవ్వాలని అన్నారు. సొంత నిధులతో స్కూల్ నిర్మిస్తామన్నా కూడా ముందుకు రావడం లేదని తెలిపారు. అలాగే ఫతేనగర్ డివిజన్ అమృత తండాలో ఉంటున్న నిరుపేదలుకు కట్టిన డబుల్ బెడ్ రూమ్ లు కేటాయించాలని తెలిపారు. అలాగే కెపిహెచ్బి లో జిహెచ్ఎంసి స్థలాలలో కూడా హౌసింగ్ బోర్డు వారు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని, ఇవి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని సూచించారు. అలాగే ప్రశాంత్ నగర్ లోని హెల్త్ సెంటర్ నిర్మాణం కొరకు స్థలం కేటాయించామని ఇప్పటికే పనులు ప్రారంభించాలని అధికారులకు తెలిపామని, ఆ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కెపిహెచ్బి లోని 100 పడకల ఆసుపత్రి పనులు వేగవంతం చేసే విధంగా చూడాలని, దీనికి టెండర్లు కూడా పూర్తి చేసి గుత్తేదారిని కూడా నియమించడం జరిగిందని, ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తిచేస్తే నిరుపేదలకు ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని పెండింగ్లో ఉన్న పనులు కూడా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ సమావేశంలో కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చింది

## మహిళ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు




**కూకట్ పల్లి, మే 18 (క్రైమ్ మిర్రర్) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన ప్రజలకు చేసింది ఏమీ లేదు అని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ మహిళా నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పరిపాలనపై ఇప్పటికే ప్రజలు విసిగి పోయారని, అబద్ధపు హామీలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండున్నర సంవత్సరాల కాలం గడిచినా చేసింది ఏమీ లేదని అన్నారు. ముఖ్యంగా మహిళలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా తులం బంగారం ఇస్తామని అలాగే ప్రతి మహిళకు 2500 ఇస్తామని చెప్పి అధికారంలోకి రావడం జరిగిందని అన్నారు. అంతేకాకుండా ఎక్కడ ఎన్నికలు జరిగితే అక్కడ తప్ప బతుకమ్మ చీరలు ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన లక్ష రూపాయలు కళ్యాణ్ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకం, బతుకమ్మ చీరలు, పెన్షన్ 200 నుంచి 2000 చేయడం ఇటువంటి మంచి నిర్ణయాలు ఆయన తీసుకున్నదే తప్ప కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క మంచి పని కూడా చేయలేదని అన్నారు. కెసిఆర్ కట్టిన డబుల్ బెడ్ రూములు కూడా ఇప్పటికే 40 వేలకు పైగా ఉన్నాయని కనీసం అవి కూడా ఇవ్వడం లేదని అన్నారు. ఎక్కడ చూసినా వ్యర్థాలు పెరిగిపోయి దోమలు బెడద ఎక్కువైందని, దీంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని, కనీసం దోమల మందు కూడా పిచికారి చేయడం లేదని, అలాగే మంచినీటి సమస్యలు తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కేసీఆర్ ఉన్నప్పుడు ప్రజారోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ తీసుకునేవారని, మంత్రులు ముఖ్యమంత్రితో సహా ఎవరిష్టారాజ్యంగా వాళ్ళు ఉంటూ.. ప్రజా పరిపాలన గాలికి వదిలేసారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల్లో ఉంటూ ప్రజలకి బిఆర్ఎస్ పార్టీలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ మనం ముందుకు వెళదామని, అలాగే ఈ నెల 25వ తారీఖున బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సారధ్యంలో కూకట్ పల్లి నియోజకవర్గంలోని కార్యకర్తల సమావేశానికి పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని, తిరిగి మళ్లీ భవిష్యత్తులో కెసిఆర్ ని ముఖ్యమంత్రిగా చేసుకుని తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగడాల బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

### అమిళనాడు అనుసరిస్తున్న విధానం అనుసరణీయం

### రాష్ట్రాలకు కేంద్ర కేబినేట్ కార్యదర్శి సోమనాథన్ సూచన

హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టివి సోమనాథన్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. సోమవారం కేంద్ర కేబినెట్ సెక్రెటరీ తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఆయా రాష్ట్రాల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు సరళతరమైన,మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పాదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్ లైన్ లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియజేస్తున్నామన్నారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. కేబినెట్ సెక్రెటరీ సిఎస్ కె.రామకృష్ణారావును ఈ-గవర్నెన్స్ విధానంపై అభినందించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కూడా అధ్యయనం చేసి ప్రజలకు ఎలాంటి ఆర్థికభారం, ఇతర ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో ఈ-గవర్నెన్స్ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్, ముఖ్యకార్యదర్శి యోగితారాణా, షికాగోయల్, సెక్రెటరీలు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎం.డి వి.పి. గౌతం, సెర్ప్ సిఇఒ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఈపీసెట్ 2026 లో ఎంజేపి విద్యార్థుల హవా

- 516 ర్యాంక్ సాధించిన హర్షిణి
- అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఐదువేల లోపు ర్యాంకులు
- ఇంజనీరింగ్ లో 10వేల లోపు ర్యాంకులు
- విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం అభినందన

హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ విద్యార్థులు ఈఏపీసెట్-2026 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. అగ్రికల్చర్ , ఫార్మసీ మరియు ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నత విద్యా కోర్సుల కోసం నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలో 3781 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. వీరిలో ఐదువేల లోపు ర్యాంక్ 46మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ 178 మంది విద్యార్థులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హర్షిణి (516వ ర్యాంక్), కల్పిత (1315 ర్యాంక్), కె. శ్రవణ్ కుమార్ (1377 ర్యాంక్), టి. నవ్య(1692 ర్యాంక్) అత్యుత్తమ ర్యాంక్ సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో బి. అనిరుధ్ (3513 ర్యాంక్ ), జి. వినోద్ కుమార్ (3568 ర్యాంక్ ), ఎన్. రుషిక్ వర్మ (4433 ర్యాంక్) సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో మొత్తం 1626 మంది ఎంజెపి విద్యార్థులు క్వాలిఫై కాగా వీరిలో ఐదు వేల లోపు ర్యాంక్ సాధించిన వారు 43 మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ సాధించిన వారు 122 మంది విద్యార్థులు ఉన్నారు. 20000 లోపు ర్యాంక్ 247 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 703 మంది విద్యార్థులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 2155 మంది విద్యార్థులు క్వాలిఫై కాగా వారిలో 5000 లోపు ర్యాంక్ ముగ్గురు విద్యార్థులు, 10000 లోపు ర్యాంక్ 56 మంది విద్యార్థులు, 20000 లోపు ర్యాంక్ 167 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 412 మంది విద్యార్థులు సాధించారు. ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు అరజత సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ముఖ్య కార్యదర్శి బాల మాయా దేవి గారు, ఎం జె పి కార్యదర్శి బడుగు సైదులు గారు అభినందించారు. ఈ ఫలితాలు బీసీ గురుకుల విద్యాసంస్థల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ప్రత్యేక శిక్షణ, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు. ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు మెరుగు పరిచామని, ప్రత్యేక ఆన్ లైన్ కోచింగ్ ద్వారా విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల శిక్షణ అందిస్తున్నామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ మాత్రమే ఉండగా గత ఏడాది కొత్తగా పది సిఓఇలు లు, ఈ ఏడాది మరో పది సిఓఇలు ఏర్పాటు చేశామన్నారు.




# విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ఎన్టిఏ

### న్యూఢిల్లీ లోని ఎన్టిఏ కార్యాలయం ముందు భారీ ఆందోళన చేపట్టిన ఎన్ ఎస్ యు ఐ నాయకులు

**కూకట్ పల్లి, మే 18 (క్రైమ్ మిర్రర్) :** ఎన్ ఎస్ యు ఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్ పిలుపు మేరకు, తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్లా జాన్ వందలాది మంది కార్యకర్తలతో కలిసి న్యూఢిల్లీ లోని ఎన్టిఏ కార్యాలయం ముందు భారీ ఆందోళన చేపట్టారు. అనంతరం ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర నాయకులు గొల్ల జాన్ మాట్లాడుతూ 22 లక్షల మంది నీట్ విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న అవినీతి పరులైన ఎన్ టి ఏ పై మా పోరాటం మరింత ఉగ్రరూపం దాల్చుతుందని అన్నారు. విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల కన్నీళ్లు, యువత కలలను నాశనం చేసిన ఈ నిర్లక్ష్య వ్యవస్థను దేశం ఇక భరించదని తెలిపారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును అమ్మేసిన ఎన్ టి ఏను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల న్యాయం కోసం ఎన్ఎస్యూఐ పోరాటం ఆగదు, వెనక్కి తగ్గదు చివరి వరకు కొనసాగుతుందని తెలిపారు.

# ఇంధన ధరల తగ్గింపు కొరకు వినూత్న నిరసన

**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్





ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని సూర్యాపేట దంతాలపల్లి రోడ్డుపైన సిపిఎం పార్టీ నారకులు ఆటోకు తాడు కట్టి లాగుతూ వినూత్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంధన ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులపై మోయలేని భారాన్ని మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే ప్రజలపై భారం మోపారని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు బొజ్జ శ్రీనివాస్ ఉప సర్పంచ్ సురేందర్ రెడ్డి అంజపల్లి లక్ష్మయ్య బత్తుల తిరుమలేష్ బాణాల విజయ్ రెడ్డి కూసు బాలకృష్ణ పెద్దింటి జగన్ రెడ్డి సుంకిరెడ్డి జనార్దన్ రెడ్డి బత్తుల రవి తొట్ల బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

# బుల్లెట్ వేగంతో రాయల్ ఎన్ఫీల్డ్ ఫ్యాక్టరీ

### సిఎం చంద్రబాబుతో ప్రతినిధుల భేటీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్లో ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్ఫీల్డ్ భారీ పెట్టుబడితో తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాయల్ ఎన్ఫీల్డ్ సంస్థ ప్రతినిధులు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. రాయల్ ఎన్ఫీల్డ్ సంస్థ సీఈఓ గోవింద రాజన్ నేతృత్వంలోని బృందం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా బుల్లెట్ మోటార్ సైకిల్ మోడళ్లను సీఎం పరిశీలించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. బు÷-లలెట్ మోటార్ సైకిల్ తయారీ యూనిట్కు ఏపీ ప్రభుత్వం ప్రోత్సాహకాలను కల్పించటంపై ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాళ్లకుప్పం, వానల్లూరు గ్రామాల వద్ద రూ.2500 కోట్ల పెట్టుబడితో రాయల్ ఎన్ఫీల్డ్ తయారీ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి 18 నెలల్లోనే ఉత్పత్తి ప్రారంభించాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో ప్రభుత్వం వేగంగా ముందుకెళ్తోందని సీఎం పేర్కొన్నారు. రాయల్ ఎన్ఫీల్డ్ వంటి అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ తయారీ యూనిట్లో అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ప్రధాన తయారీ ఎ÷-లాంట్తో పాటు టెస్టింగ్ ట్రాక్, పరిశోధనా కేంద్రం, వెండార్ పార్క్ ఎకోసిస్టమ్ కూడా నిర్మించనున్నట్లు వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగానికి కొత్త ఊపు రానుందని భావిస్తున్నారు. ఈ ఎ÷-లాంట్ ద్వారా ఏడాదికి సుమారు 9 లక్షల మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అలాగే ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 15 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.




# ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ

'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామి సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ ఎ÷−లాన్ చేస్తున్నారట.ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట.అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.



# అవును పెళ్లయ్యింది.... నలుగురు పిల్లలు

విమర్శకులకు నటి త్రిష ఘాటు రిప్లై కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడినట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు. ప్రస్తుతం ఆమె సూర్య 'కరుప్ప'(తెలుగులో 'వీరభద్రుడు'), 'విశ్వంభర'లో నటిస్తున్నారు.




# పెద్ది ఏమైనా దేవుడి పేరా..?

గ్లోబర్ స్టార్ యాక్టర్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం పెద్ది స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ డ్రామాగా వస్తోన్న ఈ చిత్రానికి ఉప్పెన ఫేం బుచ్చి బాబు సాన దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ జూన్ 4న 2026 థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్‌లో బిజీబిజీగా ఉన్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఇక్కడ ఏ కుర్రోడిని అడిగినా ఫేవరేట్ ప్లే ఆట మారుతుంది కానీ ఫేవరేట్ ప్లేయర్ (ఆటగాడు) మారడం లేదు.. అంటూ బొమన్ ఇరానీ చెబుతున్న డైలాగ్స్‌తో షురూ అయింది ట్రైలర్. పెద్ది ఈ ఏరియాలో ఏమైనా దేవుడి పేరా.. అంటే నా ఫేవరేట్ క్రికెటర్ పెద్ది సార్.. నా ఫేవరేట్ రెజ్లర్ పెద్ది సార్.. నా ఫేవరేట్ రన్నర్ పెద్ది సార్.. ఈ కుర్రాళ్లకు ఫేవరేట్ గుడిలో దేవుడు కాదు.. గ్రౌండ్‌లో దేవుడు. ఆటే నా పొగరు.. అంటూ రాంచరణ్ చెబుతున్న డైలాగ్స్ అభిమానుల్లో ఫుల్ జోష్ నింపుతున్నాయి.

ఆ తర్వాత హీరోయిన్ జాన్వీకపూర్ ఎంట్రీ ఇవ్వడం.. ఆకాశంలో నుంచి చుక్కలు రాలిపడతాయంటారు కా కదా.. ఓ చుక్కమైనా విజయనగరంలో ఈ పూట రాలిపడినాదేంటి రా.. అంటూ స్నేహితుడిని అడుగుతూ కొత్త యాసలో సాగుతున్న రాంచరణ్ డైలాగ్స్ థియేటర్లలో అభిమానులు, మూవీ లవర్స్‌కు సరికొత్త అనుభూతిని అందించబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తున్నాయి. క్రికెట్, రెజ్లింగ్, రన్నింగ్.. ఇలా మల్టీ స్పోర్ట్స్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్‌తో హింట్ ఇచ్చాడు డైరెక్టర్. నాకు ఆట గెలవడం కాదు.. బతకడం కావాలి.. అంటూ కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ పవర్ ఫుల్ డైలాగ్స్‌తో అదరగొట్టేస్తున్నాడు. పాన్ ఇండియా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# అనన్య పాండే మూవీ చాంద్ మేరా దిల్

బాలీవుడ్ యువ నటి అనన్యా పాండే, 'కిల్' సినిమాతో మెప్పించిన లక్ష్య జంటగా నటిస్తున్న కొత్త సినిమా 'చాంద్ మేరా దిల్'. ఈ సినిమా మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. హైదరాబాద్ నేపథ్యంలో రాబోతున్న ఈ టీజర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన క్యాంపస్ లవ్ స్టోరీ అని అర్థమవుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజీలో ఆరవ్, చాందిని అనే ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన ప్రేమ, ఆ తర్వాత వారి జీవితాల్లో ఎదురైన మలుపులు, బాధాకరమైన సంఘటనలను ఈ సినిమాలో చాలా ఎమోషనల్‌గా చూపించబోతున్నారు. మరో విశేషమేమిటంటే, ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే జరిగింది, ఇది తెలుగు ప్రేక్షకులకు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తోంది. సచిన్-జిగర్ అందించిన మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. నిజానికి ఈ సినిమా ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సి ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేసి, ఇప్పుడు మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: